తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట యాద్రాద్రి భువనగిరి
గురువారం 30 జూలై 2026
పేజీలు : 8
Follow :



# అర్హులైన ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

- రూ.21వేల కోట్లతో రైతన్నపై రుణభారం తగ్గించాం..
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం..
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ఖమ్మం రూరల్, జూలై 29 (జనంసాక్షి)** అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు వస్తుందని,ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటనూ తూచా తప్పకుండా అమలు చేస్తుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తూ ముందుకు సాగుతోందన్నారు. బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ఖమ్మం రూరల్ మండల పరిధిలో రూ.7.21 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. డాక్యా తండాలో రూ.1.41 కోట్లతో మంగళగూడెం - డాక్యా తండా రోడ్డు, పల్లెగూడెంలో రూ.5.80 కోట్లతో గొల్లగూడెం నుంచి ఎన్.ఎస్.పీ. మీదుగా పల్లెగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి అన్నారు. రైతు భరోసా ద్వారా ప్రతి ఎకరానికి రూ.6 వేల చొప్పున కేవలం 9 రోజుల్లోనే రూ.9,200 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. రూ.2 లక్షల వరకు ఉన్న రుణమాఫీ ద్వారా 25 లక్షల మంది రైతులకు రూ.21,000 కోట్ల మేర ఆర్థిక భారం తగ్గించామని వివరించారు. సన్న వరిధాన్యానికి మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు.నాలుగు విడతల్లో నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. తొలి విడతలో 4.50 లక్షలు, రెండో విడతలో 2.50 లక్షలతో కలిపి ఇప్పటివరకు మొత్తం 7 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. రెండో విడతలో మిగిలిన గ్రామాలకు త్వరలోనే ఇళ్లు మంజూరు చేస్తామని, రాబోయే మూడో, నాలుగో విడతల్లో అర్హులైన ప్రతీ కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు.

**- మహిళా సాధికారతే ధ్యేయం..**

రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టామని అన్నారు. గ్రామీణ రహదారులు, విద్యాసంస్థలు, తాగునీరు, మిగతా 2లో

## భూ రికార్డుల ప్రక్షాళనపై
# కలెక్టర్ ఫోకస్

- వారం రోజుల్లో స్పష్టత తీసుకురావాలని ఆదేశంభూ వివాదాలకు తావులేకుండా కచ్చితమైన రికార్డులు రూపొందించాలి
- ప్రభుత్వ, అటవీ భూముల సర్వేను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశం
- బొల్లారం పట్టి, అచ్చంపేట పట్టీల రికార్డులపై ప్రత్యేక దృష్టి



**చందంపేట, జూలై 29 (జనంసాక్షి):** జిల్లాలో భూ రికార్డుల ప్రక్షాళనను వేగవంతం చేసి, భూ వివాదాలకు తావు లేకుండా స్పష్టమైన రికార్డులు రూపొందించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం చందంపేట మండల తహసీల్దార్ కార్యాలయాన్ని దేవరకొండ ఆర్డీవో బి. పద్మప్రియతో కలిసి సందర్శించిన కలెక్టర్, తహసీల్దార్ సత్యనారాయణతో పాటు రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భూముల రీ-సర్వే, ప్రభుత్వ భూములు, అటవీ భూములు, రెవెన్యూ భూముల సర్వే పురోగతి, ఎదురవుతున్న సమస్యలను గ్రామాల వారీగా సమీక్షించారు.ప్రభుత్వ భూముల సర్వేలో క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలన నిర్వహించి, రైతుల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. భూ రికార్డుల నిర్వహణలో కచ్చితత్వం పాటించి, భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు అవకాశం లేకుండా మిగతా 2లో

# తాలిపేరు 'జల హోరు'

- 24 గేట్లు ఎత్తి 84 వేల క్యూసెక్కుల నీరు విడుదల
- 7 గేట్లు పూర్తిగా.. 17 గేట్లు 2 అడుగులు ఎత్తివేత
- రిజర్వాయర్‌లో క్రమేపి పెరుగుతున్న నీటిమట్టం
- వరద ఉధృతిని బట్టి మొత్తం 25 గేట్లు ఫ్రీ ఫ్లో పెట్టే చాన్స్
- వర్షాలకు అన్నదాతల ముఖాల్లో ఆనందం



**చర్ల, జూలై 29 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో పెదమిడిసిలేరు గ్రామం వద్ద ఉన్న తాలిపేరు ప్రాజెక్టు వరద నీటితో పరవళ్ళు తొక్కుతోంది.ప్రాజెక్టుకి ఎగువన గల చత్తీస్‌గఢ్ రాష్ట్ర అటవీప్రాంత వాగువంకల నుంచి వరద నీరు భారీగా ప్రాజెక్టు రిజర్వాయర్‌లోకి వస్తోంది. ఈ నేపథ్యంలో అధికారులు సిబ్బంది అప్రమత్తమై వరద నీటిని (ఇన్‌ఫ్లో) అంచనా వేస్తూ అవసరమైన మేరకు గేట్లు ఎత్తి దిగువ వాగులోకి వదిలేస్తున్నారు. ఆ వరద అంతా తాలిపేరు వాగు ద్వారా సమీప గోదావరిలో కలుస్తోంది. ఈ మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు ద్వారా 5 టీఎంసీల నీటిని వినియోగించుకునేలా డ్యాం డిజైన్ చేశారు.

**74 మీటర్ల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన**

తాలిపేరు ప్రాజెక్టుకి మొత్తం మిగతా 3లో

## విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్రానికి
# అసలైన పెట్టుబడి

- రూ.4.85 కోట్లతో గొల్లగూడెం ఆశ్రమ పాఠశాల అభివృద్ధికి శంకుస్థాపన..
- పేద పిల్లలకు కార్పొరేట్‌కు ధీటుగా నాణ్యమైన విద్య, వసతులు కల్పిస్తున్నామని వెల్లడి..
- 'ఉద్దీపకం-3' పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి శ్రీనివాసరెడ్డి..



3లో

జనంసాక్షి

# కల్లూరు లో వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు



**కల్లూరు జూలై 29(జనం సాక్షి)**
కల్లూరు పట్టణం లో గల షిరిడి సాయి ధ్యాన మందిరంలో ఆలయ పూజారి ఎలమంచిలి మధుసూదన శర్మ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా మూల విరాట్కుపంచామృతాభిషేకము చందనాభిషేకం, పుష్పాభిషేకాలు సాయి నామస్మరణ, కాకడ హారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ భమిడిపాటి రవి కృష్ణ శర్మ గురు పౌర్ణమి విశిష్టత, విశేష పూజలు వాటి యొక్క ఫలితాలు భక్తులకు వివరించారు. గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న వందలాది మంది భక్తులు సాయిబాబాను దర్శించుకొనిప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులు దాతలు అందించిన విరాళాలతో ఆలయ నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్, కమిషనర్ గుర్రం సాయి కృష్ణారెడ్డి ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు పలువురు కౌన్సిలర్లు భక్తుల తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, గుండ్ల పుల్లారావు, యాస నాగమణి శ్రీకాంత్, కిష్టంశెట్టి లక్ష్మి కొండలు బొల్లం శంకర్ రాధా దంపతులు, మైలవరపు వెంకట నగేష్ దంపతులు. మేనేజర్ నంది శెట్టి నాగేశ్వరావు, పసుమర్తి రాంబాబు తదితరులు పాల్గొని సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదములు స్వీకరించి అన్నదాన కార్యక్రమం లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు కొప్పురపు బలరాం, గుగులోతు బాలాజీ, గార్లపాటి శ్రీనివాసరావు, బొగ్గవరపుమురళి, తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లాను విద్యారంగంలో అగ్ర భాగాన నిలపాలి

**ప్రతి విద్యార్థి రాణించినప్పుడే విద్యా వ్యవస్థకు సార్థకత కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
సూర్యాపేట జిల్లాను విద్యా రంగంలో మరింత అగ్రపథాన నిలిపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు.బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లకు నిర్వహిస్తున్న మూడు రోజుల సమగ్ర వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు, బాధ్యతలపై దిశా నిర్దేశం చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి గానూ పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ లో సూర్యాపేట జిల్లా ప్రచేష్టలో మొదటి స్థానాన్ని సాధించడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేస్తూ విద్యాశాఖ బృందాన్ని అభినందించారు.ప్రపంచీకరణ వేగంగా విస్తరిస్తున్న తరుణంలో విద్యార్థుల భవిష్యత్తు అవసరాలను గుర్తించి తరగతి గది బోధన సాగాలని స్పష్టం చేశారు. కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, కృత్యాధార బోధన, ప్రయోగాలు, ప్రాజెక్టులు, గ్రూప్ డిస్కషన్స్ ద్వారా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ను ఉపాధ్యాయులు సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఆదేశించారు. చదువుతో పాటు విద్యార్థులు సర్వతోముఖాబి వృద్ధి సాధించేలా పర్యవేక్షించడానికి ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.క్లాస్ రూమ్‌లో కేవలం కొందరు విద్యార్థులు మాత్రమే కాకుండా, ప్రతి ఒక్కరూ రాణించి ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే విద్యా వ్యవస్థ అసలైన లక్ష్యం నెరవేరుతుందని అన్నారు.ప్రతి విద్యార్థి నైపుణ్యాలు సాధించేలా చూడాల్సిన పూర్తి బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని, సూర్యాపేట జిల్లాను విద్యా రంగంలో మరింత మెరుగైన స్థానంలో నిలపాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో కె.అశోక్, సెక్టోరియల్ అధికారులు హరికృష్ణ, రేణుక, సెంటర్ ఇంచార్జ్ నాగరాణి, జిల్లా రిసోర్స్ పర్సన్లు శ్రీహరి శ్రవణ్, సత్యనారాయణ రెడ్డి, యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

# భాష పండిట్స్ , పిఈటి లను అప్ గ్రేడ్ చేయాలి

ములకలపల్లి జులై 30 జనంసాక్షి : జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులను ప్రభుత్వం 2024 సంవత్సరం లో అప్ గ్రేడ్ చేసిందని, గిరిజన సంక్షేమ శాఖలో ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న 437 మందిని ఇప్పటివరకు అప్ గ్రేడ్ చేయకపోవడం చాలా దారుణమని డాక్టర్ గరికే శ్రీనివాస్ వాపోయారు. 10,479 పోస్టులను అప్ గ్రేడ్ చేసిన ప్రభుత్వం కేవలం 437 పోస్టు పోస్టులను చేయకపోవడం చాలా దారుణం అని ఆయన వాపోయారు. ఏజెన్సీ ఏరియాలోని మారుమూల గిరిజన గ్రామాలలో ఎంతో శ్రమతో రాత్రి పగలు అక్కడే ఉండి డ్యూటీ చేస్తున్న గిరిజన పండిట్స్, పీఈటీలను గిరిజనులు అనే చులకన భావంతో ఇప్పటివరకు అప్ గ్రేడ్ చేయకపోవడం దారుణమని ఏఐ వై ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మరియు హ్యూమన్ రైట్స్ జిల్లా చైర్మన్ డాక్టర్ గరికే శ్రీనివాస్ అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారిని వెంటనే అప్ గ్రేడ్ చేయాలని కోరారు

# వరదల్లో దాహం తీర్చిన చారిత్రక హ్యాండ్ పంపు మాయం..

- ❍ 1986 నుంచి ప్రజలకు సేవలందించిన పంపు అదృశ్యం..
- ❍ పోలీసులకు ఫిర్యాదు చేయనున్న గ్రామపంచాయతీ
- ❍ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



**బూర్గంపహాడ్ జూలై 29 (జనంసాక్షి)**
1986 గోదావరి మహా వరదల సమయంలో వేలాది నిర్వాసితులకు తాగునీటి ఆధారంగా నిలిచిన చారిత్రక హ్యాండ్ పంపు అదృశ్యం కావడం బూర్గంపహాడ్‌లో చర్చనీయాంశమైంది. ఒకప్పుడు వరదలు వచ్చిన ప్రతిసారీ ప్రజల దాహం తీర్చిన ఈ పంపు ఇప్పుడు ఆనవాళ్లు లేకుండా మాయమవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, 1986లో గోదావరి ఉధృతంగా ప్రవహించి పరిసర ప్రాంతాలు ముంపునకు గురైనప్పటికీ, హ్యాండ్ పంపు ఉన్న ప్రదేశం మాత్రం సురక్షితంగా ఉండేది. దీంతో నిర్వాసితులు అక్కడికి చేరుకుని ఈ పంపు నీటినే తాగుతూ రోజులు గడిపారని, అప్పటి నుంచి ప్రతి వరద సమయంలోనూ ఈ పంపు ప్రజలకు ఎంతో ఉపయోగపడిందని చెబుతున్నారు. అయితే ఇటీవల ఆ పంపును ఎవరో తొలగించడంతో అక్కడ కేవలం తవ్వకాల ఆనవాళ్లు మాత్రమే కనిపిస్తున్నాయి. ప్రజల అవసరాలకు ఉపయోగపడే ప్రభుత్వ ఆస్తిని ఎవరు, ఏ ఉద్దేశంతో తొలగించారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**- పంచాయతీ కార్యదర్శి వివరణ.**

ఈ విషయంపై గ్రామపంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా, "హ్యాండ్ పంపు మాయ మైన విషయం మా దృష్టికి వచ్చింది. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తాం. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతాం" అని తెలిపారు.

**- స్థానికుల డిమాండ్..**

హ్యాండ్ పంపు అదృశ్యంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదే ప్రదేశంలో తిరిగి హ్యాండ్ పంపును ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ పంపును పరిరక్షించడం అధికారుల బాధ్యత అని వారు అభిప్రాయపడుతున్నారు.

# ఐదు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత..

భద్రాచలం జూలై 29 (జనంసాక్షి)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- భద్రాచలం పట్టణంలోని కొల్లుగూడెం ఇసుక ర్యాంపు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లను బుధవారం జిల్లా టాస్క్ ఫోర్స్ సీఐ రమాకాంత్ పట్టుకున్నారు. త్రివేళల్లో భారీ శబ్దాలతో ట్రాక్టర్ల రాకపోకలపై అందిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ దాడుల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించిన ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. వాటిపై చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సైలు ప్రవీణ్, సుమన్, రామారావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్సు సీఐ రమాకాంత్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేలా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని, జిల్లాలో ఎక్కడైనా ఇటువంటి అక్రమ కార్యకలాపాలు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# అర్హులైన ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి ఆగిపోకుండా ముందుకు తీసుకెళు_న్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, కాంగ్రెస్ల మహిళా జిల్లా నాయకురాలు మద్దినేని స్వర్ణ కుమారి, ఖమ్మం ఆర్‌డీవో ఎన్.శ్రీనివాస్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, పీఆర్ ఈఈ మహేష్‌బాబు,వైస్ చైర్ పర్సన్ తమ్మినేని నవీన్,ఖమ్మం రూరల్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోట వీరభద్రం, ఎందులాపురం మున్సిపాలిటీ అధ్యక్షులు బానోత్ కిషోర్, గ్రామ సర్పంచ్ చుండూరి సృజన, కౌన్సిలర్లు చింతమళ్ళ రవీందర్, బుర్ర మహేష్, కళ్లెం వెంకటరెడ్డి, బోడ వెంకన్న, పలువురు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# భూ రికార్డుల ప్రక్షాళనపై కలెక్టర్ ఫోకస్

చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.మండలంలోని బొల్లారం పట్టి, అచ్చంపేట పట్టీల భూ రికార్డులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆయా గ్రామాల రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించి స్పష్టత తీసుకురావాలని తహసీల్దార్‌కు ఆదేశించారు. మండలంలోని అన్ని గ్రామాల భూ రికార్డులను వారం నుంచి పది రోజుల్లో పూర్తి స్థాయిలో సరిచేసి సిద్ధం చేయాలని సూచించారు.ఈ ప్రక్రియలో ప్రతిరోజూ కనీసం మూడు నుంచి నాలుగు గంటల పాటు ప్రత్యేకంగా భూ రికార్డుల పరిశీలనపై దృష్టి సారించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. రీ-సర్వే సందర్భంగా ఎదురవుతున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే, మండలంలో జరుగుతున్న భూ రికార్డుల పరిశీలన, రీ-సర్వే పనులను దేవరకొండ ఆర్డీవో నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే పరిశీలించిన పొగిళ్లకు సంబంధించిన అభ్యంతరాలను త్వరితగతిన పరిష్కరించి, సంబంధిత రికార్డులను కూడా సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

# ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల పట్ల హెచ్‌ఎంలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

**ఐటీడీఏ పీవో బి రాహుల్**



**భద్రాచలం జూలై 29 (జనంసాక్షి)**
రానున్న 36 గంటలు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గిరిజన గ్రామాలలో మారుమూల ప్రాంత గిరిజనులందరూ అప్రమత్తంగా ఉండి ప్రత్యేక జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించి మీ పిల్లలను వాగులు వంకల వైపు వెళ్లకుండా చూడాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ గిరిజన సంక్షేమ అధికారులను ఆదేశించారు. వాతావరణ శాఖ అధికారుల సూచనల మేరకు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున గిరిజన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గోదావరి వరదల ముంపునకు గురి అయ్యే ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజన ప్రజలు, ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులను ముందస్తుగా అప్రమత్తంగా ఉంచాలని, భారీ వరద ప్రవాహ సమయంలో నదులు, కాలువలు, చెరువులు వంటి ప్రాంతాలకు వెళ్లకూడదని, వాటిని దాటేందుకు ప్రయత్నించరాదని అన్నారు. అలాగే రహదారులు, కల్వర్టులపై నీరు ప్రవహిస్తున్న చోట్ల కూడా దాటడానికి సాహసించకూడదని,తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున గిరిజనులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోని కాచి వడబోసిన మంచినీటినే తాగాలని, పరిసరాల ముందు నిలువ నీరు ఉండకుండా చూసుకోవాలని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల, వసతి గృహాలలో చదువుతున్న గిరిజన విద్యార్థినీ విద్యార్థుల పట్ల హెచ్‌ఎం వార్డెన్లు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలు ఎవరు వారి ఇన్స్టిట్యూషన్ పరిధిలోని వాగులు వంకలకు వెళ్లకుండా చూడాలని, ఇన్స్టిట్యూషన్లలో పరిశుభ్రత పాటించి విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్రానికి అసలైన పెట్టుబడి

- రూ.4.85 కోట్లతో గొల్లగూడెం ఆశ్రమ పాఠశాల అభివృద్ధికి శంకుస్థాపన.
- పేద పిల్లలకు కార్పొరేట్‌కు ధీటుగా నాణ్యమైన విద్య, వసతులు కల్పిస్తున్నామని వెల్లడి.
- 'ఉద్దీపకం-3' పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి శ్రీనివాసరెడ్డి..



**ఖమ్మం రూరల్, జూలై 29:(జనం సాక్షి )**
ప్రభుత్వ విద్యా రంగంలో చదివే పేద విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నాణ్యమైన విద్యను, అత్యుత్తమ వసతులను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. విద్యార్థుల భవిష్యత్తుపై పెట్టే ఖర్చే రాష్ట్రానికి అసలైన పెట్టుబడి" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గొల్లగూడెం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో రూ.4.85 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి భూమిపూజ నిర్వహించారు.

**- కార్పొరేట్‌కు ధీటుగా సర్కారు బడులు.**
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. సర్కారు బడులను నాణ్యమైన విద్యకు నిలయాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందన్నారు. గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలో అదనపు వసతి గృహం, డైనింగ్ హాల్, ఆధునిక వంటగది, అదనపు తరగతి గదులు, టాయిలెట్ బ్లాక్‌లు, సోలార్ ఫెన్సింగ్, ఓవర్ హెడ్ ట్యాంక్ వంటి మౌలిక వసతులు అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. వీటి ద్వారా విద్యార్థినులకు పరిశుభ్రమైన, సురక్షితమైన విద్యా వాతావరణం లభిస్తుందన్నారు.

**- చదువే జీవితాన్ని మార్చే శక్తి..**
తల్లిదండ్రులు పడే కష్టాన్ని గుర్తుంచుకుని విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని మంత్రి పిలుపునిచ్చారు. "పేదరికం కారణంగా ఏ ఒక్కరి చదువు ఆగకూడదనేదే ప్రభుత్వ సంకల్పం. చదువు మాత్రమే మనిషి జీవితాన్ని, సమాజాన్ని మార్చగల శక్తి" అని ఆయన వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను తమ సొంత పిల్లల్లా భావించి, నాణ్యమైన విద్యతో పాటు మంచి నైతిక విలువలను అందించాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు శ్రద్ధ చూపుతున్న ఐటీడీఏ అధికారులను ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ రూపొందించిన 'ఉద్దీపకం-3' పుస్తకాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. విద్యార్థుల చదువు పూర్తయ్యాక ఉపాధి కల్పనలో మార్గదర్శకత్వం వహించేందుకు 'వారధి' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని త్వరలోనే చేపట్టనున్నట్లు పీవో వెల్లడించారు. అనంతరం మంత్రి పాఠశాల విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మునిసిపాలిటీ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, పీఆర్ ఇఇ మహేష్ బాబు, ఖమ్మం రూరల్ తహసీల్దార్ వినయ్ చంద్ర రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.




## నేడు కల్లూరులో మంత్రి పొంగులేటి ఆధ్వర్యంలో ప్రజా దర్బార్

**కల్లూరు జూలై 29(జనం సాక్షి):** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని కల్లూరు తల్లాడ మండలాలకు సంబంధించి రైతులు ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం , అర్హులైన లబ్ధిదారులకు పలు సంక్షేమ పథకాల మంజూరి కోసం దరఖాస్తులు స్వీకరించేందుకు రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టారాగమయి దయానంద్ ఆధ్వర్యంలో కల్లూరు లో రెవెన్యూ సదస్సులో భాగంగా ప్రజా దర్బార్ కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నట్లు కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొట్రూ అర్జున్ రావు, పట్టణ కమిటీ అధ్యక్షులు షేక్ ఉస్మాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా దర్బార్ కార్యక్రమం కల్లూరు మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలోని మధిర రోడ్డు ప్రాంతంలో గల డీఎస్పీ ఫంక్షన్ హాల్ లో గురువారం సాయంత్రం మూడు గంటలకు జరుగుతుందన్నారు. ప్రజా దర్బార్ సందర్భంగా ప్రజల నుంచి భూ సంబంధిత సమస్యలుఇందిరమ్మ ఇల్లు సంబంధిత సమస్యలు ఇతర వ్యక్తిగత లేదా ప్రభుత్వ సంబంధిత సమస్యలను లిఖితపూర్వకంగా తీసుకుని ప్రజా దర్బార్‌కు హాజరుకావాలని కోరారు.ముఖ్య అతిథులుగా రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రిపొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సత్తుపల్లి ఎమ్మెల్యేడా. మట్టా రాగమయి దయానంద్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డా. మట్టా దయానంద్ , ఖమ్మం జిల్లాకలెక్టర్ దివాకర్ కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ అజయ్ యాదవ్, వివిధ శాఖల అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు. రెండు మండలాలకు చెందిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి: తహసీల్దార్ సూర్యప్రకాష్

అశ్వాపురం, జూలై 29 (జనం సాక్షి):రానున్న 36 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అశ్వాపురం తహసీల్దార్ సూర్యప్రకాష్ విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.లోతట్టు ప్రాంతాల ప్రజలు, రైతులు, పశుపోషకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే తప్ప ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. వాగులు, వంకలు, చెరువులు, కల్వర్టుల వద్దకు వెళ్లకుండా ఉండాలని, పిల్లలను నీటి వనరుల సమీపానికి వెళ్లనివ్వకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని కోరారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీసు, వైద్య, విద్యుత్, పంచాయతీరాజ్ తదితర శాఖలు అప్రమత్తంగా ఉన్నాయని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# తాలిపేరు 'జల హోరు'

25 క్రస్ట్ గేట్లు ఉన్నాయి. ప్రాజెక్టు రిజర్వాయర్‌లో మంగళవారం అర్ధరాత్రి నుంచి వరద మొదలై గంటగంటకు పెరుగుతోందని ప్రాజెక్టు డీఈఈ తిరుపతి తెలిపారు.ప్రాజెక్టు వద్ద నుంచి అందుతున్న అధికార సమాచారం ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి 1 గంట సమయంలో 5 గేట్లు పూర్తిగా ఎత్తి 24930 క్యూసెక్కుల నీటిని డ్యామ్ నుంచి వదిలేశారు. తెల్లవారుజాము 3.30 గంటలకు 11 గేట్లు 2 అడుగుల మేర ఎత్తి 14486 క్యూసెక్కులు వదిలేశారు. బుధవారం ఉదయం 7 గంటలకు 13 గేట్లు 2 అడుగులు ఎత్తి 17475 క్యూసెక్కుల నీరు వదిలేశారు. 8 గంటలకు 17 గేట్లు 2 అడుగులు ఎత్తి 23200 క్యూసెక్కులు వదిలేశారు. ఉదయం 9.30 గంటలకు 22 గేట్లు 2 అడుగులు ఎత్తి 30024 క్యూసెక్కులు విడుదల చేశారు. మధ్యాహ్నం 12.30 గంటలకు 22 గేట్లు 2 అడుగులు, మరో 2 గేట్లు పూర్తిగా (ఫ్రీ ఫ్లో) ఎత్తి 46801 క్యూసెక్కులు రిలీజ్ చేశారు. 1.30 గంటలకు
21 గేట్లు 2 అడుగులు, 3 గేట్లు ఫ్రీ ఫ్లో పెట్టి 53048 క్యూసెక్కుల నీరు వదిలేశారు. 2 గంటలకు 19 గేట్లు 2 అడుగులు, 5 గేట్లు పూర్తిగా ఎత్తి 65398 క్యూసెక్కులు రిలీజ్ చేశారు. 3 గంటల సమయంలో 17 గేట్లు 2 అడుగులు, 7 గేట్లు పూర్తిగా ఎత్తి 79017 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలేశారు. సాయంత్రం 5 గంటలకు 13 గేట్లు 2 అడుగులు, 11 గేట్లు ఫ్రీ ఫ్లో పెట్టి 84376 క్యూసెక్కుల నీరు డిశ్చార్జ్ చేస్తున్నారు. వరదని బట్టి మరికొన్ని గేట్లు ఫ్రీఫ్లో పెట్టే అవకాశం కనిపిస్తోంది. వరద ఉధృతంగా ఉన్నప్పుడు డ్యామ్ సేఫ్టీ కోసం మొత్తం 25 గేట్లు కూడా పూర్తిగా ఎత్తి సుమారు 1 లక్ష 50 వేల క్యూసెక్కుల నీటిని వదిలేసిన సందర్భాలు కూడా ఉన్నాయి.

**- అన్నదాతల ముఖాల్లో ఆనందం**
గత రెండు రోజులుగా ఎడతెరపు లేకుండా వర్షపు జల్లులు పడుతున్నాయి. గేట్లు ఎత్తి వరద నీటిని వదిలేస్తున్న తాలిపేరు ప్రాజెక్టు వద్ద జలహోరు సంతరించుకుంది. ప్రస్తుతం నిండుకుండలా ఉన్న ప్రాజెక్టుని చూసి ఆయకట్టు రైతులు మురిసిపోతున్నారు. ఎందుకంటే తర్వాత వర్షాలు



పడకపోయినా ఒకసారి రిజర్వాయర్ నిండితే ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల క్రింద చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో సాగు అవుతున్న 24500 ఎకరాల్లో ఖరీఫ్ (వానాకాలం) పంటకు సాగునీటికి ఎలాంటి ఢోకా ఉండదు. మొన్నటివరకు వరినాట్లే వేస్తామో లేదో అని బెంగతో ఉన్న రైతుల్లో వర్షపు జల్లులు ఆనందం నింపుతున్నాయి. చెరువులు, కుంటల్లో నీటి జాడ కనిపిస్తోంది. పంటలు పండినా పండకపోయినా వర్షపు జల్లులకు వరినాట్లే వేస్తామని రైతులు చెబుతున్నారు. వర్షపు జల్లుల్లోనే నాట్లు చకచకా జరిగి పోతున్నాయి.

**- తాలిపేరు వద్ద జన సందడి**
తాలిపేరు ప్రాజెక్టుకి భారీగా వరద వచ్చి గేట్లు ఎత్తిన నేపథ్యంలో నీటి విడుదల అందాన్ని తిలకించడానికి వర్షంలో సైతం ప్రజలు డ్యాం చెంతకు పరుగులు తీస్తున్నారు. ప్రాజెక్టు వద్ద సెల్ఫీలు దిగి సోషల్ మీడియాలో పోస్టు చేసి మురిసిపోతున్నారు. మండల కేంద్రమైన చర్లకి సుమారు 7 కిమీ దూరంలో తాలిపేరు
ప్రాజెక్టుకి ఆటోలు, ద్విచక్ర వాహనాలలో వెళ్ళి వస్తున్నారు.

**- నెరవేరని పర్యాటకుల కోరిక**
పరిసర అందాలతో పర్యాటకులను ఎంతగానో ఆకర్షించే తాలిపేరు ప్రాజెక్టు ప్రాంతాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే పర్యాటకుల కోరిక పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా నెరవేరడం లేదు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు, భద్రాద్రి కలెక్టర్, భద్రాచలం ఐటీడీఏ పివోలు పర్యాటకుల సౌకర్యార్థం సకల సౌకర్యాలతో తాలిపేరుని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని చర్ల మండల ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.




## నైతిక ఓటమిని ట్రంప్ అంగీకరించాలి తమ్మినేని వీరభద్రం

ఖమ్మం కార్పొరేషన్, జూలై 29 (జనం సాక్షి ) ఇరాన్ తో యుద్ధంలో అమెరికా నైతికంగా ఓడిపోయిందని, ఆ ఓటమిని ట్రంప్ అంగీకరించి వెంటనే ఒప్పందాలు చేసుకోవాలని సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రంన్ అన్నారు.స్థానిక సుందరయ్య భవనంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్ర శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని తమ్మినేని వీరభద్రం ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరాన్ పెట్టిన అన్ని నిబంధనలను అమెరికా అంగీకరిస్తుందని ట్రంప్ చెబుతూ పైకి మాత్రం యుద్ధంలో తమదే పై చేయి అంటున్నారని ఆయన అన్నారు. మేకపోతు గంభీరంలా ట్రంప్ వ్యవహారం ఉందని ఆయన అన్నారు. అందుకే యుద్ధంలో నైతికంగా అమెరికా ఓటమిని అంగీకరించాలని ఆయన అన్నారు.ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో రైతులు ఈ సమస్య ఎదురు చూడడానికి సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయక పోవడమే కారణమని అన్నారు. సీతారాం ప్రాజెక్టు పూర్తి చేస్తుంటే రైతులకు ఖమ్మం జిల్లాలో త్రాగు, సాగునీటి సమస్య ఉండేది కాదని అందుకనే వెంటనే సీతారాం ప్రాజెక్టు పూర్తి చేయాలని అన్నారు.ఈ జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాచర్ల భారతి, బండి రమేష్ , కళ్యాణం వెంకటేశ్వరరావు, వై విక్రమ్ భూక్య వీరభద్రం, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, బండి పద్మ, మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు....

### ప్రజల అవగాహన అప్రమత్తతతోనే

# సైబర్ మోసాల నుండి రక్షణ

### జిల్లా ఎస్పీ కె.నరసింహ




సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి): సైబర్ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని, బాధితులకు త్వరగా నగదు రిఫండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సైబర్ వారియర్ సిబ్బంది, పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ కె.నరసింహ ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్ మోసాల కేసుల దర్యాప్తు వేగవంతం చేయడం, బాధితులకు త్వరగా నగదు రిఫండ్ చేయడం, ప్రజలను చైతన్యపరచడం వంటి ప్రధాన అంశాలపై జిల్లాలోని పోలీసు అధికారులు, సైబర్ వారియర్ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన, అప్రమత్తత పెరిగినప్పుడే మోసాల నుండి రక్షణ పొందుతారని పేర్కొన్నారు. సైబర్ మోసాలపై వచ్చే ఫిర్యాదులను ఏమాత్రం అలస్యం చేయకుండా వెంటనే సైబర్ క్రైమ్ పోర్టల్‌లో నమోదు చేయాలని, కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని తెలిపారు. బాధితులు మోసపోయిన డబ్బును సాధ్యమైనంత త్వరగా త్వరగా వారి ఖాతాలో జమ అయ్యేలా చూడాలని సూచించారు. దీనికోసం బ్యాంకులు, కోర్టు అధికారులతో తగిన సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. సైబర్ నేరాలు ప్రస్తుతం పెద్ద సమస్యగా మారాయని, సిబ్బంది ప్రతి కేసును ఎంతో బాధ్యతగా తీసుకుని పనిచేయాలని అన్నారు. సైబర్ మోసగాళ్ళు వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా సమాచారం, ఓటీపీలు, సీక్రెట్ పిన్ నంబర్లను దొంగిలించి ప్రజలను ఆర్థిక నష్టానికి గురిచేస్తున్నారని అన్నారు. ఫోన్ కాల్స్ లేదా సందేశాల ద్వారా అపరిచిత వ్యక్తులు డబ్బులు పంపాలని అడిగితే అది సైబర్ మోసగాళ్ళ ఎత్తుగడ అని గ్రహించాలన్నారు.అత్యాశకు పోతే తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు.ప్రజలు వ్యక్తిగత జాగ్రత్తలు పాటిస్తూ, అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ల భయాన్ని, అత్యాశను పెట్టుబడిగా పెట్టుకుని మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఇలాంటి కాల్స్ లేదా మెసేజ్‌లు వస్తే వెంటనే 1930కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని, మోసం జరిగినట్లు గుర్తించాగానే గోల్డెన్ హవర్ మొదటి గంటలో పిర్యాదు చేయాలన్నారు.సైబర్ మోసాలకు గురి కాకుండా పలు సూచనలు చేశారు.



## విబిజి రాంజీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

మధిర, జూలై 29 (జనంసాక్షి): మధిర మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న వివిజి రాంజీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవోకు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. గత 3 నెలలుగా వేతనాలు రాక పిల్లల స్కూల్ కాలేజ్ ఫీజులు, బ్యాంకు రుణాల ఈ ఈ ఎంఐ లు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం పెండింగ్ వేతనాలు చెల్లించి ప్రతి నెల 1 వ తేదిన వేతనాలు చెల్లించాలని, ఉద్యోగులకు తక్షణమే పే స్కేల్ అమలు చేసి, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, లేని యెడల రేపటి నుంచి దశల వారిగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూ అవసరమైతే సమ్మె కు వెళ్ళనున్నట్లు ఉద్యోగులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ నేతలు ఆవుల సంతోష్ కుమార్, సూదిని జానకిరామిరెడ్డి, బొల్లెద్దు విజయకుమార్, రేలచర్ల అనిల్ కుమార్, ఉద్యోగులు వేల్పుల ముత్తయ్య, గుజ్జర్లపూడి చిన శాంతయ్య, సుగ్గల గిరీష్ బాబు, ఆదరం సుజాత లు పాల్గొన్నారు.

## సోయం రాజబాబుకి నివాళులు అర్పించిన ఊప్పల వెంకటరమణ



దమ్మపేట జూలై 29 (జనం సాక్షి): దమ్మపేట మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మండల సీనియర్ నాయకులు,మాజీ సర్పంచ్ సోయం రాజబాబు ఇటీవల హటన్మరణం చెందిన విషయం తెలుసుకుని చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి,నివాళులు తెలియజేసి,వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఓటర్ సవరణ కార్యక్రమ,బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమ నియోజకవర్గ పరిశీలకులు ఊప్పల వెంకటరమణ.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు దొడ్డా రమేష్,సీనియర్ నాయకులు పగడాల నరేంద్ర,నియోజకవర్గ నాయకులు సోయం విరభద్రం,నియోజకవర్గ మాజీ యూత్ కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు,యర్రయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో బీఎస్ ఐ బృందం పరిశీలన..

భద్రాచలం జూలై 29 (జనంసాక్షి) భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఐఎస్ఓ సర్టిఫికేషన్ ప్రక్రియలో భాగంగా బ్రిటిష్ స్టాండర్డ్స్ ఇన్స్టిట్యూషన్ బృందం బుధవారం తనిఖీలు చేపట్టింది. డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, బీఎస్ ఐ టీమ్ హెడ్ డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ప్రియాంక, క్వాలిటీ టీమ్ మేనేజర్ శ్రీకాంత్, ఇన్ ఛార్జ్ రాధలతో కూడిన బృందం ఆసుపత్రిలోని ఓపీ, అత్యవసర విభాగం, ఇన్ పేషెంట్ వార్డులు, ఆపరేషన్ థియేటర్, ఐసీయూ, ఎస్ ఎన్ సియు, డయాలసిస్, ల్యాబ్, ఫార్మసీ తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించింది. ఐఎస్ ఓ ప్రమాణాల ప్రకారం రోగుల భద్రత, ఇన్ఫెక్షన్ నియంత్రణ, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, మౌలిక వసతులు, పరిశుభ్రతపై ప్రత్యేకంగా మూల్యాంకనం చేశారు. అనంతరం వైద్యులు, నర్సింగ్ సిబ్బందితో మాట్లాడి క్వాలిటీ ప్రొటోకాల్స్ అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఆర్ ఎంఓ డాక్టర్ సంతోష్, డాక్టర్ మల్లేష్, వివిధ విభాగాలధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పోషకాహారంతో తొలి అడుగు

మధిర, జూలై 29 (జనంసాక్షి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం, విద్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన ఉచిత అల్పాహార పథకం ఇల్లూరు గ్రామంలో బుధవారం ఘనంగా ప్రారంభమైంది.డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఇల్లూరు కాంగ్రెస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలోఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధిర మార్కెట్ యార్డులోని సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ద్వారా హరే కృష్ణ చారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అల్పాహారం అందించారు. ఇల్లూరు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పత్తిపరపు సంగయ్య సీనియర్ కాంగ్రెస్ నాయకులు మార్తా ఈశ్వరరావు,కోట రాకేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది.ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు మాట్లాడుతూ..పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అల్పాహారం అందించడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం,భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ పథకాన్ని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట.వెంకటేశ్వర్లు, కోట. వాసు, కోట. మరియదాసు,కటారపు. పుల్లయ్య, గద్దల.రాకేష్, గద్దల.వినయ్, గద్దల.కళ్యాణ్, మస్తాన్, జాన్, రాజబాబు, పాఠశాల ఉపాధ్యాయలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో ఘనంగా దమ్మక్క సేవ యాత్ర

- స్వామి వారికి పుష్పార్చన, నిత్యకళ్యాణం నిర్వహణ.
- హాజరైన భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, సర్పంచ్.
- జోరు వానలో కొనసాగిన శోభ యాత్ర ..
ఆదివాసీ ముత్తైదువులకు సారె సమర్పణ..

భద్రాచలం జూలై 29 (జనంసాక్షి) భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో దమ్మక్క సేవ యాత్ర ఘనంగా నిర్వహించారు. భక్త రామదాసు ఆలయాన్ని నిర్మించక ముందే అడవిలో సీతారాముల విగ్రహాలను పూజించిన అపర భక్తురాలు పోకల దమ్మక్కస్మృత్యర్థం ప్రతి ఏటా గురుపౌర్ణమి రోజున సేవ యాత్రను గత 12 ఏళ్లుగా ప్రతి ఏటా సంప్రదాయ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవం పూర్తిగా గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు మరియు వారి భాగస్వామ్యంతోనే సాగుతుంది. తొలుత రామాలయంలో మూలవరుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ఆలయం వెలుపల పొగడచెట్టు వద్ద దమ్మక్క విగ్రహానికి ఆలయ ప్రధాన అర్చకులు విజయరాఘవన్ ఆధ్వర్యంలో హారతి కార్యక్రమం నిర్వహించారు. అలాగే మెట్ల సమీపంలో ఉన్న వ్యాస మహర్షి విగ్రహం వద్ద పూజలు జరిపారు. అనంతరం రామాలయం నుంచి స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రచార రథంలో ఉంచి పట్టణ వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. గిరిజనుల సాంప్రదాయ కొమ్ము వాయిద్యాలు, డప్పు చప్పుళ్లతో ముందుకు సాగిన శోభ యాత్ర వీధుల్లో గిరిజన భక్తులు చేసిన సాంప్రదాయ నృత్యాలు, విన్యాసాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయిఆ పుష్పాలతో విశేష పుష్పార్చన సేవను వైదిక బృందం నిర్వహించారు. అలాగే భక్తుల సమక్షంలో స్వామి వారి కళ్యాణం నేత్రపర్వంగా సాగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, కంకణ దారణ, యజ్ఞోపవీతదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, చివరగా వేద ఆశీర్వచనం నిర్వహించారు. అనంతరం గిరిజన ముత్తైదువులకు దేవస్థానం ఈవో కె.దామోదర్ రావు సారెను అందజేశారు. అలాగే శోభయాత్రకు హాజరైన గిరిజ నులందరికి పసుపు, కుంకుమ, జాకెట్, కందువను దేవస్థానం తరపున అందజేయడంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులకు అన్నప్రసాద సౌకర్యం కల్పించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 800 మంది వరకు గిరిజనులు హాజరయ్యారు. పట్టణంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా శోభయాత్ర సాఫీగా సాగేలా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# గాయత్రి జ్ఞానపీఠంలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు..

### జ్ఞానపీఠ వ్యవస్థాపకులు దయానిధి వసంతాచార్యులుచే ఆత్మబోధ, గీతా పారాయణం..

### తహసిల్దార్ అద్దంకి నరేష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం.

**మణుగూరు, జూలై 29 (జనంసాక్షి):** మన జీవితంలోని అజ్ఞానమనే చీకటిని తొలగించి, జ్ఞానమనే వెలుగును ప్రసాదించే గురువులను, ఉపాధ్యాయులను, పెద్దలను పూజించి సత్కరించే రోజు గురు పౌర్ణమి, అని శ్రీశ్రీశ్రీ అనంత సద్గురు జ్ఞానపీఠ వ్యవస్థాపకులు అక్కినేపల్లి దయానిధి వసంతాచార్యులు అన్నారు. బుధవారం మణుగూరు జయశంకర్ నగర్ లోని జ్ఞానపీఠ ఆధ్యాత్మిక కేంద్రంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా గురుపూజ, హోమం కార్యక్రమం చేశారు. అనంతరం లీలావతి సమేత దయానిధి వసంతాచార్యులు గురువులకు శిష్య బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువులచే సత్సంగం గీతా పారాయణం ఆత్మబోధ గురుశిష్యుల అనుబంధం గురించి బోధించారు. మణుగూరు మండల తహసిల్దార్ అద్దంకి నరేష్ లాస్య జ్యేష్ఠ కుమారుడు మణికంఠ జన్మదిన వేడుకలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆదియోగి శివుడు 'గురువుగా' మారిన రోజుతొలి శైవ సంప్రదాయం ప్రకారం, జగద్గురువైన పరమశివుడు (ఆదియోగి) ఈ పౌర్ణమి రోజునే ఆదిగురువుగా మారారు. ఆయన హిమాలయాల్లోని కాంతిసరోవరం ఒడ్డున సప్తరుషులకు యోగ విజ్ఞానాన్ని, ఆధ్యాత్మిక రహస్యాలను బోధించడం ప్రారంభించింది ఈ రోజునే. వర్షాకాలంలో నాలుగు నెలల పాటు ఒకే చోట ఉండి, ప్రయాణాలు చేయకుండా జప, తప, ధ్యాన సాధనలలో గడుపుతారు. గురు పౌర్ణమి రోజున గురువులకు సేవ చేయటం



ఆశీస్సులు తీసుకోవటం గురు దక్షిణ కిందికే వస్తుంది. ఈ రోజున సద్గురువులైన దత్తాత్రేయ స్వామి, దక్షిణామూర్తి, శిరిడీ సాయిబాబా, రాఘవేంద్ర స్వామి వంటి ఎంతోమంది గురువులు అనేక రకాల విద్యలలో హితబోధ చేశారు. వారందరిని స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ గురువుని గౌరవించాలని కోరారు.

**గురువును ఎందుకు పూజించాలి:**

హిందూ సనాతన ధర్మంలో భారతీయ సంస్కృతిలో "ఆచార్య దేవోభవ" అని గురువుకు దైవంతో సమానమైన స్థానాన్ని ఇచ్చారు. గురువును పూజించడానికి వెనుక ఉన్న ముఖ్యమైన ఆధ్యాత్మిక, నైతిక కారణాలు ఎన్నో ఉన్నాయి.

మన మనస్సులోని అజ్ఞానం, అహంకారం అనే చీకట్లను తొలగించి, జ్ఞానమనే వెలుగును చూపే వ్యక్తి గురువు. దేవుడు అంతటా ఉన్నాడని, ఆ దైవాన్ని ఎలా చేరుకోవాలో లేదా ఎలా తెలుసుకోవాలో గురువు మాత్రమే మార్గం చూపిస్తారు. అందుకే "గురుర్బ్రహ్మ గురుర్విష్ణు గురుదేవో మహేశ్వరః" అంటారు. అంటే త్రిమూర్తుల స్వరూపమైన సృష్టి, స్థితి, లయ కారకమైన శక్తులు గురువులోనే ఉన్నాయని భావిస్తారు. జీవితానికి క్రమశిక్షణ, సంస్కారం ఇవ్వడం వ్యక్తిత్వ వికాసం కేవలం పుస్తకాల్లోని చదువు మాత్రమే కాకుండా, సమాజంలో ఎలా బ్రతకాలో, మంచి-చెడుల విచక్షణను గురువు నేర్పుతారు. సమాజంలో మంచి పౌరుడుగా తీర్చిదిద్దుతారు. ఒక పచ్చి మట్టి ముద్దను అందమైన శిల్పంగా మలిచినట్లు, మనలోని లోపాలను సరిదిద్ది ఉత్తమమైన వ్యక్తిగా తీర్చిదిద్దుతారు. జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను సమానంగా ఎలా స్వీకరించాలో గురువు బోధిస్తారు. మానసిక ప్రశాంతతను, ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించి సంసార బంధాల నుండి విముక్తి వైపు నడిపిస్తారు. మన ఎదుగుదలకు కారణమైన వారిని గౌరవించడం మన సంస్కృతి. గురువు మనకు ఇచ్చిన జ్ఞానానికి బదులుగా మనం ఇచ్చే గౌరవం గురు పౌర్ణమి రోజున ప్రతి గురువును శిష్యుడు కృతజ్ఞతా భావంతో పూజించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అక్కినేపల్లి ప్రదీప్ శాస్త్రి, కే కళ్యాణ్, శ్రీనివాస్ మణుగూరు మండల తహసిల్దార్ అద్దంకి నరేష్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ గౌరి ప్రసాద్,క్రాంతి, సమితి సింగారం ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, పట్టణ ప్రముఖులు, విశ్వబ్రాహ్మణ కుల పెద్దలు భక్తులు, శిష్యులు తదితరులు పాల్గొన్నారు.



## మండల స్థాయి సమావేశంలో పాల్గొన్న అధికారులు,సర్పంచులు

**దమ్మపేట జూలై 29 (జనం సాక్షి):** దమ్మపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు,సర్పంచులు పాల్గొన్నారు. ఈ సమావేశం మండల ప్రత్యేక అధికారి రవి కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దమ్మపేట తాసిల్దార్,(ట్రైనీ డిప్యూటీ కలెక్టర్) మద్దినేని మురళి,ఎంపీడీవో బి.రవీంద్ర రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు ప్రస్తుతం ఎల్ నీనో ప్రభావం వలన వర్షాభావ పరిస్థితులకు అనుగుణముగా పంటలు వేసుకోవాలనితెలిపారు,ఇరిగేషన్ శాఖ అధికారులు సీతారామ ప్రాజెక్టు భూసేకరణకు గ్రామ పంచాయతీలు సహకరించాలని కోరారు. అదేవిధంగా గ్రామ పంచాయతీలకు అధిక విద్యుత్ బిల్లు వస్తున్నందున ఆయా పంచాయతీ లోని అధికారులు వీధిలైట్లు,మోటార్ల వినియోగం పై దృష్టి పెట్టాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీల నందు కోతులు,కుక్కల సంఖ్య ఎక్కువగా ఉన్నందున ప్రజలు వాటి బారిన పడకుండ సంబంధిత సర్పంచులు చొరవ తీసుకుని వాటి సంతానోత్పత్తి వాక్సిన్ అందుబాటులోకి తేవాలని సంబంధిత వెటర్నరీ శాఖ అధికారులకు తెలిపారు.



# గురు పౌర్ణమి ఆధ్యాత్మికతకు ప్రతీక

### వేద పండితులు వీవీఆర్‌కే మూర్తి

### సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు

### - భక్తులకు అన్నదాన కార్యక్రమం

**చంద్రుగొండ, జూలై 29 (జనం సాక్షి):** గురు పౌర్ణమి భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం కల్పించే పవిత్రమైన పర్వదినమని చంద్రుగొండకు చెందిన వేద పండితులు, పూజారి వీవీఆర్‌కే మూర్తి తెలిపారు. గురువే అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానమార్గంలో నడిపించే దైవస్వరూపమని, గురు పౌర్ణమి రోజున గురువులను భక్తిశ్రద్ధలతో స్మరించడం, వారి ఆశీస్సులు పొందడం వల్ల విద్య, విజ్ఞానం, ఆధ్యాత్మిక పురోగతి కలుగుతాయని వివరించారు. వ్యాస మహర్షి జన్మదినంగా కూడా ఈ రోజును జరుపుకుంటారని, అందుకే దీనిని వ్యాస పౌర్ణమి అని కూడా పిలుస్తారని పేర్కొన్నారు.గురు పౌర్ణమిని పురస్కరించుకొని స్థానిక సాయిబాబా ఆలయంలో బుధవారం ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం సాయిబాబాకు మహామంగళహారతి నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమం విజయవంతం కావడంలో నిర్వాహకులు కృపాకర్, కిరణ్ రెడ్డి, సంక శంకర్, బుంగ శ్రీను, మధు, కడియాల నాగేశ్వరరావు తదితరులు విశేషంగా సహకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బూర్గంపహాడ్లో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు..

### భక్తులకు అన్నదాన కార్యక్రమం

**బూర్గంపహాడ్ జూలై 29 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారికి పవిత్ర అభిషేకాలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అర్చనలు చేపట్టారు. ఈ వేడుకలకు మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి సాయిబాబా దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందుతూ కుటుంబాల సుఖశాంతి, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని ప్రార్థనలు చేశారు.

అనంతరం భక్తులు అందించిన విరాళాలతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వందలాది మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త డాక్టర్ చెన్నం సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా గురు పౌర్ణమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు, భక్తులందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని సాయిబాబాను ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఉత్సవాలు భక్తిపారవశ్య వాతావరణంలో ప్రశాంతంగా ముగిశాయి.





## మధిరలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

**మధిర , జూలై 29 (జనంసాక్షి):** గురు పౌర్ణమి సందర్భంగా మధిర పట్టణంలోని శ్రీ దివ్య సాయి సేవా ట్రస్ట్ మందిరంలో వేం చేసి ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో గురు పౌర్ణమి సందర్భంగా గురు పౌర్ణమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ షిరిడి సాయిబాబా ను దర్శించుకుని దైవ కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవాలయ అధ్యక్షుడు పబ్బతి వెంకట రవికుమార్, కోశాధికారి కురువెళ్ల కృష్ణ తగు ఏర్పాట్లు చేసినామని తెలిపారు . తదుపరి మధ్యాహ్నం 11 గంటలకు మహా అన్నదానం కలదు కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందగలరని శ్రీ దివ్య సాయి సేవ ట్రస్ట్ అధ్యక్షులు పబ్బతి వెంకట రవికుమార్ వారి కుటుంబసభ్యులు ,దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. అదేవిధంగా మండలం, పట్టణంలోని సాయిబాబా ఆలయాల్లో గురు పౌర్ణమి సందర్భంగా బాబా వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు బాబా వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# చెక్‌డ్యామ్ కూల్చివేత విధ్వంస పాలనకు నిదర్శనం

ఖమ్మం కార్పొరేషన్, జూలై 29 (జనం సాక్షి) ఖమ్మం నగరంలోని ప్రకాశ్‌నగర్ వద్ద మున్నేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేయడం ప్రజా ప్రయోజనాలను విస్మరించిన విధ్వంసకర పాలనకు నిదర్శనమని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. బుధవారం చెక్‌డ్యామ్ కూల్చివేసిన ప్రాంతాన్ని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సందర్శించి పరిస్థితిని పరిశీలించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చెక్‌డ్యామ్ కూల్చివేత కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, అనాలోచిత నిర్ణయాలు, ముందుచూపు లేని పాలనకు ప్రత్యక్ష ఉదాహరణ అని అన్నారు.

కేసీఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనుల ఆనవాళ్లను చెరిపివేయాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని, ఖమ్మం జిల్లాలోని కాంగ్రెస్ మంత్రులు తుమ్మల, పొంగులేటి అదే విధానాన్ని అమలు చేస్తూ అభివృద్ధి విధ్వంసానికి పాల్పడ్డారని ఆరోపించారు. ముఖ్యంగా ఖమ్మం నియోజకవర్గంలో ప్రజలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తులను ధ్వంసం చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా మారిందని విమర్శించారు. ఖమ్మం నగరానికి దీర్ఘకాలిక తాగునీటి భద్రత కల్పించాలనే లక్ష్యంతో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చొరవతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రకాశ్‌నగర్ వద్ద మున్నేరు వాగుపై సుమారు రూ.8 కోట్ల వ్యయంతో చెక్‌డ్యామ్ నిర్మించారని గుర్తు చేశారు. ఈ చెక్‌డ్యామ్ నిర్మాణం వల్ల మున్నేరు పరివాహక ప్రాంతంలో భూగర్భ జలమట్టం గణనీయంగా పెరిగి, నగర వ్యాప్తంగా నీటి లభ్యత మెరుగుపడటంతో తాగునీటి సమస్యకు గణనీయమైన ఉపశమనం లభించిందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ.525 కోట్ల వ్యయంతో మున్నేరుకు ఇరువైపులా 17 కిలోమీటర్ల మేర రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. దానవాయిగూడెం నాగార్జునసాగర్ కాలువ ప్రాంతం నుంచి ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి వరకు సుమారు 60 అడుగుల ఎత్తుతో నిర్మి స్తున్న రిటైనింగ్ వాల్ పనులు ప్రస్తుతం కొనసా గుతున్నాయని, ఈ నిర్మాణం పూర్తయితే భవిష్యత్తులో వరదల నుంచి నగరానికి మెరుగైన రక్షణ లభిస్తుందని వివరించారు. అయినప్పటికీ, చెక్‌డ్యామ్ కారణంగానే వరదలు వస్తున్నాయంటూ తప్పుడు ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ ప్రభుత్వం దానిని కూల్చివేసిందని విమర్శించారు.

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో భవిష్యత్తులో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి నిల్వలను పెంచడం, చెరువులు, వాగులు, చెక్‌డ్యామ్‌లను సంరక్షించడం, భూగర్భ జలాలను పరిరక్షించడం వంటి ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. దీని కారణంగా రానున్న రోజుల్లో ఖమ్మం నగరం తీవ్ర తాగునీటి సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు ధోరణిని విడనాడి ఖమ్మం నగర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర తాగునీటి కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే మున్నేరు వాగులో నీటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించే చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు గుండాల కృష్ణ, బచ్చు విజయ్ కుమార్, పగడాల నాగరాజు, బత్తుల మురళిప్రసాద్, ఖమర్, పాలడుగు పాపారావు, మాటేటి నాగేశ్వరరావు, తోట రామారావు, తాజుద్దీన్, మెంతుల శ్రీశైలం, ఎర్రా అప్పారావు, మాటేటి కిరణ్, కొప్పెర నర్సింహారావు, ముక్కాల రాజేశ్, రఘు, రవి, తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బీటెక్ విద్యార్థి గృహిత్ రామ్ మృతి



అశ్వాపురం, జూలై 29 (జనం సాక్షి): అనారోగ్యంతో బాధపడుతున్న బీటెక్ విద్యార్థి బేతం గృహిత్ రామ్ (20) మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. చిన్నతనం నుంచే సికిల్ సెల్ అనీమియాతో బాధపడుతున్న గృహిత్ రామ్‌కు తీవ్ర జ్వరం రావడంతో తొలుత భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స అందించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలి స్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులను తీవ్ర విషాదంలో ముంచింది. మృతుడి తల్లి బేతం రాజ్యలక్ష్మి సారపాక భాస్కర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. కుమారుడి మృతితో ఆమె తీవ్ర మనోవేదనకు గురై అస్వస్థతకు లోనవడంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలిం చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తండ్రి బేతం వెంకట్రా మయ్య ఇప్పటికే మృతి చెందగా, కుటుంబంలో చోటుచేసుకున్న ఈ విషాదం స్థానికంగా అందరినీ కలచివేసింది.

### దూదేకుల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి

## నిధులు విడుదల చేయాలి

### నూర్ బాషా సంక్షేమ సంఘం జేఏసీ డిమాండ్



ఖమ్మం, (జనంసాక్షి) : దూదేకుల, నూర్ బాషా సామాజిక వర్గాల ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించాలని ముదిగాల నూర్ బాష సంక్షేమ సంఘం జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ బాష డిమాండ్ చేశారు. ఖమ్మంలోని విజయనగర్ కాలనీలో ఉన్న సంఘ కార్యాలయంలో బుధవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ బాష మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ (గతంలో టీఆర్ఎస్) ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లోని కోకాపేటలో భవన నిర్మాణం కోసం రెండు ఎకరాల భూమిని, రూ.2 కోట్ల నిధులను కేటాయించారని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిధులను వెంటనే విడుదల చేసి భవన నిర్మాణానికి తగిన అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు ఖమ్మం జిల్లాలో కూడా నూర్ బాషలకు స్థలంతో పాటు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. సంఘం రాష్ట్ర చైర్మన్ బాబుజాన్ ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా జేఏసీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర జేఏసీ యూత్ అధ్యక్షుడు షేక్ హిమామ్, ప్రచార కార్యదర్శి షేక్ మహబూబ్, మహిళా నాయకురాళ్లు షేక్ సబీనా, షేక్ సబీనాబి, లీగల్ సెల్ నాయకులు షేక్ ఎస్.డి. జైన్, నాయకులు షేక్ సిద్దాసాహెబ్, షేక్ లాల్ జాన్ పాషా, లాల్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

### వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో

## టీజీటీడబ్ల్యూఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ



కొత్తగూడెం క్రైమ్ ,జూలై29 (జనం సాక్షి): అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన మరియు వక్తృత్వ (డిబేట్) పోటీలు బుధవారం ఘనంగా జరిగాయి.వ్యాసరచన పోటీలో 60 మంది, వక్తృత్వ పోటీలో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో టీజీటీడబ్ల్యూఆర్‌జేసీ, ఆరజేసీ ఐ సీ.ఈ (బి), కేవసీడీ సైట్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వ్యాసరచన పోటీలో మా కళాశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, వక్తృత్వ పోటీలో ప్రథమ బహుమతి సాధించి కళాశాలకు కీర్తి తెచ్చిపెట్టారు.విజేతలకు సీసీఎఫ్ డా. భీమా నాయక్ , డీఎఫ్‌వో సిద్ధార్థ్ సింగ్, ఎఫ్ఆర్‌వో బాబు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కొత్తగూడెం ఎమ్మెల్యే డా. కూనంనేని సాంబశివరావు విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, కిన్నెరసాని ప్రాంత గిరిజన విద్యార్థుల ఉన్నత విద్యాభివృద్ధి కోసం ఇక్కడ ఒక డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన ప్రసంగం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ జి. రమేష్ గారు విజేతలను అభినందించి, భవిష్యత్తులో కూడా ఇలాంటి పోటీల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు విజేతలను ఘనంగా అభినందించారు.

### కాల్వ ఒడ్డు ఎస్సీ ఎస్టీ బీసీ షాపింగ్ కాంప్లెక్స్ ను

## తొలగిస్తే ప్రత్యామ్నాయం చూపాలి



తిరుమలాయపాలెం జూలై 29 (జనంసాక్షి) : కాల్వ ఒడ్డు ఎస్సీ కాంప్లెక్స్ ను కేబుల్ బ్రిడ్జి ను దృష్టిలో ఉంచు కొని రోడ్ వెడల్పులో భాగం గా కూల్చి వేస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ వారు నోటీస్ లు ఇచ్చారు. తిరిగి మున్సిపాలిటీ వారు కట్టించి మళ్ళీ మీకే ఇస్తామన్నారు. ఈ విషయమై కలెక్టర్ కి, ఈ.డి కి తెలుపుకున్నాము. అందుకు సంబంధించి హామీగా ఎటువంటి ఆర్డర్ కాపీ ఇవ్వలేదు. ఈ విషము కాల్వోడ్డు కాంప్లెక్స్ లో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ లబ్ధిదారులు ప్రెస్ మీట్ ద్వారా తమ బాధను తెలియజేసు కున్నారు ఒక వేళ కూల్చి కట్టించిన పక్షంలో కింద షాప్ లలో మా షాప్ లకు మాకే ఇవ్వాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ గౌరవ అధ్యక్షులు గుంటేటి వీరభద్రయ్య మాట్లాడుతూ షాపింగ్ కాంప్లెక్స్ లో 62 మంది చిరు వ్యాపారస్తులు పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు ఈ తరుణంలో 1984లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో అధికారి ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అధికారి నిరుద్యోగులైన వారికి జీవన భృతి కొరకు ప్రభుత్వ స్థలములో పది ఎనిమిది కొలతలతో షాపులు నిర్మించి నిరుపేదలైన అణగారిన కులాలకు షాపులు కేటాయించడం జరిగింది. ఇది సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీం లో భాగంగా కొందరికి ఆటోలు, కారులు, ఇంటి జాగలు, వ్యవసాయ భూములతోపాటు నిరుపేదల కొరకు షాపులు కేటాయించడం జరిగింది. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని నిరుపేద దుకాణదారులకు ప్రత్యామ్నాయ మార్గం చూపించి ఆదుకోవాలని ఖమ్మం జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తోగరు భాస్కర్, దేవపంగు సుదర్శన్, దాసరి శ్రీను, చెరుకుపల్లి నాగేశ్వరరావు, తగరం సుగుణమ్మ, కరిశే కమల, జిల్లపల్లి సుజాత, తెల్లూరి భాస్కర్, అర్చన జయమ్మ , లంబాడీ హక్కుల రాష్ట్ర నాయకులు భద్రు నాయక్ దళిత నాయకులు పాల్గొన్నారు.

# గ్రామం నుంచి అంతరిక్షం వరకు...

### విక్రమ్-1 రాకెట్ ప్రయోగంలో ప్రతిభ చాటిన నరేంద్రరెడ్డి

### శాలువాతో సత్కరించిన బీఆర్ఎస్ మండల నాయకులు

ముదిగొండ, (జనంసాక్షి) : గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి అంతరిక్ష పరిశోధనారంగంలో తన ప్రతిభను చాటుకున్న వ్యక్తి మోర్తాలా నరేంద్రరెడ్డి అని, ఆయన సేవలు, పట్టుదల నేటి యువతకు స్ఫూర్తిదాయకమని బీఆర్ఎస్ ముదిగొండ మండల నాయకులు కొనియాడారు. స్కైరూట్ ఏరోస్పేస్ రూపొందించిన 'విక్రమ్-1' రాకెట్ ప్రయోగంలో కీలక పాత్ర పోషించిన మాధాపురం గ్రామానికి చెందిన శాస్త్రవేత్త మోర్తాలా నరేంద్రరెడ్డిని నాయకులు బుధవారం శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ... దేశీయంగా రూపొందించిన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన విక్రమ్-1 ప్రయోగంలో ముదిగొండ మండలానికి చెందిన యువకుడు భాగస్వామి కావడం స్థానికంగానే కాకుండా, ఖమ్మం జిల్లా మొత్తానికీ గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. అంతరిక్ష సాంకేతిక రంగంలో తనదైన ముద్ర వేసిన నరేంద్రరెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ తరహా విజయాలు తెలంగాణ యువతలో సరికొత్త ఆశలు, లక్ష్యాలను



నింపుతాయన్నారు.ఈ కార్యక్రమంలో ముదిగొండ మండల మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, నాయకులు బంక మల్లయ్య, కోటి అనంతరాములు, గడ్డం వెంకటేశ్వర్లు, పడిశాల భద్రయ్య, మధుసూదన్ రావు, కేతిరెడ్డి రంగారెడ్డి, రెడ్డిమళ్ల సత్యనారాయణ రెడ్డి, కేతిరెడ్డి గోపిరెడ్డి, మోర్తాలా రవీందర్ రెడ్డి, పిల్లలమర్రి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి కి ప్రత్యేక పూజలు

ములకలపల్లి జూలై 30 జనం సాక్షి : గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలో ఉన్న ములకలపల్లి, జగన్నాధపురం, రామచంద్రాపురం గ్రామాలలో వున్న సాయిబాబా మందిరాలలో ఉదయం నుండే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పంచామృతాలతో సాయిబాబా విగ్రహానికి అభిషేకాలు, మంగళ హారతులు, ప్రత్యేక పూజలు, సాయిబాబా పుస్తకాల వితరణ, అన్నదాన కార్యక్రమాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ములకలపల్లి సాయిబాబా ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమం లో మాజీ జడ్పీటీసి బత్తుల అంజి, భద్రాద్రి జిల్లా తాండ్ర ప్రభాకర్ రావు పాల్గొనగా, జగన్నాధపురం లో జరిగిన కార్యక్రమంలో వేముల మురళి, ఈర్ల రామ్మోహన్ రావ్, రామచంద్రపురం లో జరిగిన కార్యక్రమం లో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తుంగతుర్తిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

**తుంగతుర్తి జులై 29 (జనం సాక్షి)**
నియోజకవర్గ కేంద్రంలో ఫైర్ స్టేషన్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ కంఠమయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ నూతనంగా మంజూరైన ఫైర్ స్టేషన్ ను నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేయడం చేయడం వల్ల ఐదు మండలాలకు తిరుమలగిరి, నాగారం, జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, నూతనకల్ కేంద్ర బిందువుగా ఉన్న తుంగతుర్తిలోనే ఏర్పాటు చేయాలని కోరారు, తుంగతుర్తి లో ఏర్పాటు చేస్తే అన్ని ప్రాంతాలకు సౌకర్యార్థంగా ఉంటుందని కోరారు. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు మరియు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ స్పందించి తుంగతుర్తిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు కోసం కృషి చేయాలని కోరారు. లేనిపక్షంలో అఖిలపక్ష సంఘాల ఆధ్వర్యంలో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు తడకమళ్ళ రవికుమార్, ఉప్పుల రాంబాబు, కొండ రాజు, గునిగంటి సంతోష్, బొంకూరి మల్లేష్, బొజ్జ సాయికిరణ్, కొండగడుపుల వెంకటేష్, తడకమల్ల మల్లికార్జున్, బొంకూరి మధు, బొంకూరి వెంకటేష్, బొంకూరి సాయి, తడకమల్ల మధు, కాసర్ల రాజశేఖర్, కొండ మధు, కాసర్ల పవన్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యోగుల నిరసన

**భద్రాచలం జూలై 29 (జనంసాక్షి)**
విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను నిరసిస్తూ టీజీపీఈజేఏసీ పిలుపు మేరకు భద్రాచలంలో ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. వైటీపీఎస్ ఉద్యోగుల ఆందోళనకు మద్దతుగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ డీఈ, జేఏసీ జిల్లా కన్వీనర్ జీవన్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవడానికి ఉద్యోగులంతా ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ నిరసనలో ఏడీఈ నర్సింహారావు, ట్రేడ్ యూనియన్ నాయకులు బుల్లి వెంకట్రాజు యాదవ్, రామకృష్ణ, ఉదయ్, ఏఈలు రోహిణి, జ్యోతి, ఉపేందర్, రాజారావు, సబ్ ఇంజనీర్లు, వివిధ సంఘాల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దూదేకుల సమస్యలపై మంత్రి పొంగులేటికి వినతి

**ఖమ్మం, జూలై 29 (జనంసాక్షి):**
దూదేకుల (నూర్‌బాషా) సామాజిక వర్గ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర నూర్‌బాషా దూదేకుల బీసీ ముస్లిం జేఏసీ రాష్ట్ర చైర్మన్ షేక్ బడే సాహెబ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని బుధవారం ఖమ్మంలో కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటు, దూదేకుల ఆత్మగౌరవ భవనం నిర్మాణం, సామాజిక వర్గ సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించి ఆగస్టు తొలి వారంలో హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించి సమగ్రంగా చర్చించేందుకు అపాయింట్‌మెంట్ ఇస్తామని హామీ ఇచ్చినట్లు జేఏసీ రాష్ట్ర చైర్మన్ షేక్ బడే సాహెబ్ తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల జేఏసీ నాయకులతో కలిసి హాజరుకావాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అడ్వైజర్ షేక్ పుల్లా సాహెబ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ ఇమామ్ బాయ్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ షేక్ నాగ సైదులు, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ అన్వర్ పాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మీరా సాహెబ్, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ మౌలాలి, ఖమ్మం నగర అధ్యక్షుడు షేక్ అన్వర్ పాషా, జిల్లా కమిటీ సభ్యుడు షేక్ మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.





## పట్టణంలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

### భక్తులకు అన్నప్రసాద వితరణ

**హుజూర్‌నగర్, జూలై 29, (జనంసాక్షి) :**
గురు పౌర్ణమి పురస్కరించుకొని పట్టణంలోని షిరిడి సాయిబాబా మందిరంలో బుధవారం సాయి సమాజం ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 5 గంటలకు బాబా విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం, విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ అన్నమయ్య భజన మండలి ఆధ్వర్యంలో సాయి నామ సంకీర్తన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గురు పౌర్ణమి పర్వదినం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి బాబాను దర్శించుకున్నారు. వచ్చిన భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం మహిళా భక్తులచే మల్లె, చామంతి, గులాబీలతో బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చక స్వాములు వేద మంత్రాలతో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సాయి సమాజం అధ్యక్షులు త్రిపురమల్ల అంజయ్య, సెక్రెటరీ ఓరుగంటి నాగేశ్వరావు, కోశాధికారి తోడుపునూరి శేఖర్, జాయింట్ సెక్రెటరీ ఆకుల రాము, గజ్జి ప్రభాకర్ రావు, కొత్త శ్రీనివాసరావు, నోముల సీతారాములు, పేరూరి అశోక్ కుమార్, ఏలూరి రాంబాబు, పోలిశెట్టి వెంకటేశ్వర్లు, మహేష్, నాని, ప్రతాప్ రెడ్డి, తదితర భక్తులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల కారణంగా మండల ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి

### ఆళ్ల పెల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై ముత్తినేని సోమేశ్వర్

**ఆళ్ల పెల్లి జూలై 29 ( జనం సాక్షి):**
మండలంలోని వ్యవసాయ రైతులు,కూలీలు ప్రజలందరూ వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహించే ప్రమాదాలు పొంచి ఉన్నాయని ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై ముత్తినేని సోమేశ్వర్ మాట్లాడుతూ తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అవసరమైతే తప్ప వాహనదారులు బయటికి రావద్దని ప్రజలు అప్రమత్తత పాటించి పోలీసులకు సహకరించాలని అన్నారు ఏజెన్సీ లో ఉన్న గ్రామ ప్రజలు వాగులు వొర్రెలు దాటేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



## ఆగస్టు 9న భువనగిరిలో 'అమరుల యాదిలో బస్సు యాత్ర'ను జయప్రదం చేయండి

### కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయరాములు గౌడ్

### మోటకొండూరులో బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



**మోటకొండూరు, జూలై 29(జనం సాక్షి):**
కల్లుగీత వృత్తి రక్షణ, హక్కుల సాధన కోసం ఆగస్టు 9న భువనగిరి జిల్లా కేంద్రానికి చేరుకోనున్న 'అమరుల యాదిలో బస్సు యాత్ర', ప్రదర్శన సభను గీత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయరాములు గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం మోటకొండూరులో సొసైటీ అధ్యక్షుడు గాజుల బాలరాజు గౌడ్ అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో బస్సు యాత్ర పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేతివృత్తుల్లో అత్యంత ప్రమాదకరమైన కల్లుగీత వృత్తిపై రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వచ్చి మూడేళ్లవుతున్నా వృత్తి రక్షణకు, కార్మికుల సంక్షేమానికి నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. ప్రమాదాలకు గురైన వారికి మంజూరైన ఎక్స్‌గ్రేషియా నిధులను కూడా విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఆగస్టు 2న మానుకోటలో ప్రారంభమయ్యే ఈ యాత్ర ఆగస్టు 18న హైదరాబాద్‌లో ముగుస్తుందని, ఆగస్టు 9న భువనగిరి వినాయక చౌరస్తా వద్ద జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ తండా పాండురంగం గౌడ్, సంఘం మండల నాయకులు లోడే ఉప్పలయ్య, వంగాల స్వామి, గాజుల వెంకటేష్, దూడల కొమరయ్య, వంగాల మల్లేశం, తాళ్లపల్లి వెంకటయ్య, బొల్లపల్లి సత్తయ్య, వంగాల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ చండూరు మున్సిపల్ అధ్యక్షుడుగా భూతరాజు శ్రీహరి

**చండూరు, జూలై 29 (జనంసాక్షి)**



భారతీయ జనతా పార్టీ చండూరు మున్సిపల్ అధ్యక్షులుగా భూతరాజు శ్రీహరి నీ ఏకగ్రీవంగా నల్లగొండ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి నియమించడం జరిగింది గతంలో ఏబీవీపీ లో చండూరు టౌన్ సెక్రటరీగా,బాగ్ కన్వీనర్ గా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా చేసి విద్యార్థి ఉద్యమంలో కీలకంగా పనిచేస్తూ.. బిజెపిలో చేరి బిజెపి చండూర్ మండల ప్రధాన కార్యదర్శిగా , బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులుగా బీజేవైఎం స్టడీ సర్కిల్ రాష్ట్ర కన్వీనర్ గా బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులుగా సేవలు అందించడం పట్ల నాపై నమ్మకంతో బాధ్యతకి సహకరించిన బిజెపి మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడల బిక్షం గౌడ్ దోనూరి వీరారెడ్డి రాష్ట్ర అధికార ప్రతినిధి బొమ్మరిబోయిన రాజు ముదిరాజు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు శాగా చంద్రశేఖర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కల రాజు యాదవ్ కి రాష్ట్ర నాయకులు కోమటి వీరేశం సోమ నరసింహ బొబ్బిలి మనోహర్ రెడ్డి బిజెపి చండూర్ మండల అధ్యక్షులు ముదిగొండ ఆంజనేయులుకి జిల్లా నాయకులు నకరికంటి లింగస్వామి గౌడ్, అనేపర్తి యాదగిరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ.. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి పార్టీనీ బలోపేతానికి కృషి చేస్తానని రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## చింతపల్లిలో నార్కోటిక్స్ డాగ్ బృందంతో విస్తృత తనిఖీలు..

**చింతపల్లి, జులై 29(జనంసాక్షి)**
జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చింతపల్లి మండల కేంద్రంలో బుధవారం ఎస్సై ముత్యాల రామ్మూర్తి ఆధ్వర్యంలో నార్కోటిక్స్ డాగ్ బృందంతో కలిసి విస్తృత తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, టీ స్టాళ్లను తనిఖీ చేసి నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గంజాయి, గుట్కా, పాన్ పరాగ్ వంటి నిషేధిత మత్తు పదార్థాలను విక్రయించినా, నిల్వ ఉంచినా, రవాణా చేసినా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.యువత మత్తు పదార్థాలకు బానిసై నేరాలు, దోపిడీలు, చోరీలకు పాల్పడటంతో పాటు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. సమాజంలో మత్తు పదార్థాల నిర్మూలనకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. మండలంలోని గ్రామాల్లో ఎక్కడైనా గంజాయి లేదా ఇతర నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసినా, యువతను వాటి వినియోగానికి ప్రోత్సహిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీల్లో చింతపల్లి పోలీసు సిబ్బంది, నార్కోటిక్స్ డాగ్ బృందం సభ్యులు పాల్గొన్నారు...

## వర్షాభావానికి ముందస్తు కార్యాచరణ..
# తాగునీరు, రైతుల సంక్షేమంపై కలెక్టర్ ఫోకస్

○ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం
○ఆరుతడి పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలి
○ఇందిరమ్మ ఇళ్లు, గ్రామాభివృద్ధి పనులు, వనమహోత్సవాన్ని వేగవంతం చేయాలని సూచన



**చందంపేట, జూలై 29 (జనంసాక్షి)**

ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున ప్రజలకు తాగునీటి కొరత తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, రైతులు ఆరుతడి పంటలు సాగు చేసేలా విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. బుధవారం చందంపేట మండలం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారు లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం భూగర్భ జలాలు పెరిగే పరిస్థితులు కనిపించడం లేదని పేర్కొన్నారు. ఆర్డబ్ల్యూ ఎస్, మిషన్ భగీరథ అధికారులు తాగునీటి సరఫరా పై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించి, అందుబాటు లో ఉన్న నీటిని పొదుపుగా విని యోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన కల్పించాలని, కందులు, కూరగాయలు, కీరదోస వంటి పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు బీడుగా వదిలేయకుండా సాగు చేపట్టేలా చూడాలని, అవసరమైన విత్తనాలను ప్రభుత్వం అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. యూరియా వినియోగాన్ని తగ్గించేలా రైతులకు సూచనలు ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వీబీజీ రామ్–జీ పథకం కింద ప్రతి గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని, జలసిరి కింద నీటి సంరక్షణ నిర్మాణాలు, కమ్యూనిటీ సోక్ పిట్లు, చెరువుల పూడికతీత, గ్రామీణ ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ భవనాలు, సోలార్ లైట్లు తదితర పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన మంజూరు పొందాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో నిలిచిపోయిన పనులను వెంటనే పునఃప్రారంభించి పూర్తి చేయాలని, అంగన్వాడీ భవనాలు, గ్రామ సమాఖ్య భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత లబ్ధిదారుల గుడిసెల పరిశీలనను త్వరగా పూర్తి చేసి, మొదటి విడత ఇళ్ల చెల్లింపులను నిలిపివేయకుండా కొనసాగించాలని తెలిపారు.

ప్రస్తుతం కురుస్తున్న ముసురు వర్షాలను అనుకూలంగా ఉపయోగించుకొని వనమహోత్సవం కింద విస్తృతంగా మొక్కలు నాటాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లుకు ఆదేశించారు. అలాగే గువ్వలగుట్టలో బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని దేవరకొండ ఆర్డీవో బి. పద్మప్రియ కు సూచించారు. ఈ సమావేశంలో దేవరకొండ ఆర్డీవో బి. పద్మప్రియ, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## నేరేడుచర్ల పీహెచ్‌సీ సేవలపై జిల్లా ప్రోగ్రాం అధికారి ప్రశంసలు

**నేరేడుచర్ల, జూలై 29( జనంసాక్షి) :**

నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ప్రోగ్రాం అధికారి డా. ప్రసిద్ధి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ప్రసూతి వార్డు, లేబర్ రూమ్, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. పీహెచ్‌సీలో బుధవారం సాధారణ ప్రసవం ద్వారా ఆడబిడ్డకు జన్మనిచ్చిన దేవిని ప్రత్యేకంగా పలకరించి ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉండడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ ఆసుపత్రిలో సురక్షిత ప్రసవ సేవలు అందిస్తున్న వైద్యురాలు డా. పున్న నాగిని, నర్సింగ్ అధికారులను సిబ్బందిని అభినందించారు. ప్రసూతి తల్లులకు నాణ్యమైన వైద్య సేవలు, అవసరమైన మందులు, పోషకాహారం మరియు ప్రసవానంతర సంరక్షణను ఎలాంటి లోటు లేకుండా అందించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. రోగులతో ఆప్యాయంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంచేలా పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీ సందర్భంగా సిహెచ్ఓ సల్వాది శ్రీనివాస్ ఆసుపత్రిలో అందిస్తున్న సేవల వివరాలను జిల్లా ప్రోగ్రాం అధికారికి వివరించారు. నేరేడుచర్ల పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న మెరుగైన వైద్య సేవలతో ప్రజలు విశ్వాసంతో ముందుకు వస్తుండడం సంతోషకరమని డా. ప్రసిద్ధ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ విజయలక్ష్మి, ఏఎన్ఎం సునీత, ఆశా యశోద, జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

## వినియోగదారుల మన్ననలు పొందాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**



నాణ్యమైన సేవలను అందించి వినియోగదారుల మన్ననలు పొందాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మీధ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ రోడ్ సమీపంలోని పాత స్నేహ చికెన్ సెంటర్ బిల్డింగ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్ వుడెన్ ఫర్నిచర్ షాపును వారు ప్రారంభించి మాట్లాడారు. సూర్యాపేట పట్టణం వ్యాపార రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. స్థానికంగా నాణ్యమైన ఉత్పత్తులు అందించే సంస్థలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని తెలిపారు. ఎస్ఎస్ వుడెన్ ఫర్నిచర్‌లో సొంత తయారీతో ఇంటికి అవసరమైన అన్ని రకాల వుడెన్ ఫర్నిచర్ అందుబాటులో ఉండటం అభినందనీయమన్నారు. హైదరాబాద్, విజయవాడ వంటి నగరాలకు వెళ్లకుండానే ఆధునిక డిజైన్లలో నాణ్యమైన ఫర్నిచర్‌ను సూర్యాపేటలోనే పొందే అవకాశం కల్పించడం వినియోగదారులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, జహీర్, తాహెర్, నాయకులు అబ్దుల్ రహీం, గుణగంటి సతీష్, తంగేళ్ల కర్ణాకర్ రెడ్డి, ఫరూక్, ఆలేటి మాణిక్యం, దారపునేని శ్రీనివాస రావు, పల్లెం శేఖర్, రేపాల శ్రీనివాస్, వెంకట కృష్ణారావు, శ్రీనివాస్ రెడ్డి నిర్వాహకులు వేమూరి సింధు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## మేళ్లచెరువులో గురు పౌర్ణమి వేడుకలు



శ్రీమాతా చారిటబుల్ ట్రస్టు, త్రిశక్తి ఆత్మక చండీ పీఠం ఆధ్వర్యంలో గురు పౌర్ణమి సందర్భంగా శ్రీ భూ నీలా సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో చండీ హోమం, రాజశ్యామల హోమం, వనదుర్గ హోమం, దత్తాత్రేయ మూల మంత్ర హోమాలు జరిగాయి. సర్ప దోష నివారణకు ఆశ్లేష మహాబలి, వ్యాస పూజ, గురుపాదుక పూజ, పూర్ణాహుతి నిర్వహించారు. కొంకపాక రాధాకృష్ణమూర్తి, సీతాకుమారి దంపతులకు పాద పూజ చేసి భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

## అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు జాబితాలో ఉండేలా చూడాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**



అర్హత కలిగిన ప్రతి ఒక్కరి ఓటు జాబితాలో కొనసాగేందుకు కృషి చేయాల్సిన బాధ్యత బీఎల్ఓలు, బీఎల్ఏలపై ఉందని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 15వ వార్డులో నిర్వహిస్తున్న ప్రత్యేక ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు. నిజమైన అర్హులైన ఓటర్ల పేర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగిపోకుండా చూడాలని, అవసరమైన పత్రాలతో ప్రతి ఒక్కరూ సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొని తమ వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. బీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేస్తూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని కోరారు. ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పిల్లల భవాని రమేష్ నాయుడు, నాయకులు నేరెళ్ల మధు గౌడ్, వల్దాస్ దేవేందర్, తండు శ్రీనివాస్ గౌడ్, మేఘ్యా తండా సర్పంచ్ భూక్య రాజు నాయక్, ధర్మ నాయక్, దండ అరవింద్ రెడ్డి, బిఎల్ఓలు వెంకటేశ్వర్లు, ఈశ్వరమ్మ, వెంకటరమణ, రమణ, బిఎల్ఏలు చేతుల శ్రీనివాస్, భూక్య మహేష్, ఓంకార్ పెంట భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డు కేవైసీ ఆలస్యం చేయొద్దు..
### మండల ప్రజలకు గోపాల్ రెడ్డి పిలుపు

**గుర్రంపోడు, జూలై 29 (జనంసాక్షి)**



గుర్రంపోడు మండలంలోని రేషన్ కార్డుదారులందరూ తమ రేషన్ కార్డులకు సంబంధించి కేవైసీ (కేవైసీ) ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు తప్పనిసరిగా పూర్తి చేయించుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిరంతరంగా పొందాలంటే ప్రతి రేషన్ కార్డుదారుడు కేవైసీ పూర్తి చేయించుకోవడం అత్యంత అవసరమని అన్నారు. మండలంలోని ప్రతి లబ్ధిదారుడు సమీపంలోని రేషన్ దుకాణం లేదా సంబంధిత అధికారులను సంప్రదించి వెంటనే కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన గడువు ముగిసిన తర్వాత కేవైసీ పూర్తి చేయని రేషన్ కార్డుదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అందువల్ల గుర్రంపోడు మండల ప్రజలందరూ ఈ విషయాన్ని నిర్లక్ష్యం చేయకుండా, ఎలాంటి ఆలస్యం లేకుండా కేవైసీ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని గోపాల్ రెడ్డి కోరారు. అలాగే ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి అర్హులైన లబ్ధిదారుడు గడువులోపు కేవైసీ పూర్తి చేసుకునేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## రెయిన్ బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో
# ఘనంగా రెడ్ కలర్ డే

**కొండమల్లేపల్లి, జూలై 29 (జనంసాక్షి):**

ఎరుపు వసంతకాలపు మొదటి రంగు. ఎరుపు రంగు ఆరంభానికి ప్రతీక రంగుల ఆనందాన్ని పురస్కరించుకుని కొండమల్లేపల్లి పట్టణంలోని సాగర్ రోడ్డులో గల రెయిన్ బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం రెడ్ కలర్ డే వేడుకలను చిన్నారుల ఆనందోత్సాల మధ్య ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు ఎరుపు రంగుపై అవగాహన కల్పించడంతో పాటు మన దైనందిన జీవితంలో కనిపించే ఎరుపు రంగు వస్తువులను పరిచయం చేయడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఈ సందర్భంగా విద్యార్థులు అందమైన ఎరుపు రంగు దుస్తులు ధరించి ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆపిల్, స్ట్రాబెర్రీ, టమాటా, గులాబీ పువ్వు వంటి ఎరుపు రంగు వస్తువులను పిల్లలకు పరిచయం చేశారు. వివిధ వినోదాత్మక కార్యక్రమాల ద్వారా పిల్లలు ఆనందంగా నేర్చుకున్నారు. రెడ్ కలర్ డే ఉద్దేశించి పాఠశాల కరస్పాండెంట్ ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారుల్లో రంగులపై అవగాహన పరిశీలనా నైపుణ్యం సృజనాత్మకత ఆత్మవిశ్వాసం పెంపొందించడమే కాకుండా ఆటపాటలతో కూడిన ఆనందకరమైన అభ్యాసానికి అవకాశం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫర్వీన్ సుల్తానా ప్రీప్రైమరీ ఉపాధ్యాయులు సుజాత, కావ్య, లలిత, ఎ. శోభారాణి, సిహెచ్. శోభారాణి సరస్వతి, స్వాతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# "ముంపు బాధితులకు అండగా ప్రభుత్వం - సమస్యల పరిష్కారానికి హామీ"

## ○శివన్నగూడెం ముంపు బాధితుల సమస్యలకు పరిష్కారం దిశగా అడుగులు
## ○పరిహారం, ప్లాట్లు, ఆర్అండ్ఆర్ సమస్యలపై త్వరిత చర్యలు తీసుకుంటాం
## ○కలెక్టర్ బి. చంద్రశేఖర్



**మర్రిగూడ , జూలై 29 (జనం సాక్షి)**
నల్లగొండ జిల్లా, మర్రిగూడ మండలం, శివన్నగూడెం రిజర్వాయర్ ముంపుకు గురైన నర్సిరెడ్డిగూడెం బాధితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. బుధవారం మర్రిగూడ మండలంలోని శివన్నగూడెం రిజర్వాయర్ సమీపంలో ముంపు బాధితులు స్వంతంగా నిర్మించుకున్న గృహాలను పరిశీలించి వారి సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. రిజర్వాయర్ ముంపుకు మొత్తం 287 కుటుంబాలు గురికాగా, అందులో 54 కుటుంబాలు ప్రభుత్వ స్థలాల కేటాయింపులో జాప్యం కారణంగా ప్రైవేట్ వెంచర్లో సొంత నిధులతో ఇళ్లు నిర్మించుకున్నట్లు అధికారులు వివరించారు. చింతపల్లి వద్ద ప్రభుత్వం స్థలాలు కేటాయించినప్పటికీ, ఇంకా 32 మంది లబ్ధిదారులకు ప్లాట్లు భౌతికంగా అప్పగించాల్సి ఉందని వెల్లడించారు. ఈ సందర్భంగా బాధితులు తమకు ఇందిరమ్మ గృహ పథకం కింద రూ.5 లక్షల ఆర్థిక సహాయం, ఆర్అండ్ఆర్ ప్రయోజనాలు అందించాలని, కోర్టులో పెండింగ్లో ఉన్న భూవివాదాన్ని పరిష్కరించాలని కోరారు. అలాగే గృహ సముదాయంలో రోడ్లు, మరుగుదొడ్లు, బస్సు సౌకర్యం, పబ్లిక్ టాయిలెట్, దేవాలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.
స్పందించిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భూములు కోల్పోయిన రైతులకు చెల్లించిన పరిహారం, ఇంకా చెల్లించాల్సిన మొత్తాలపై పూర్తి వివరాలు సేకరిస్తామని తెలిపారు. కోర్టు తాజా ఉత్తర్వుల మేరకు వివాదాస్పద భూములకు సంబంధించిన అవార్డు ప్రక్రియను 10?15 రోజుల్లో పూర్తి చేసి మిగిలిన వారికి ప్లాట్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామస్తుల సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీఓ శ్రీదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, మర్రిగూడ తాసిల్దార్ జక్కర్తి శ్రీనివాస్, ఎంపీడీవో మునయ్య, గ్రామ సర్పంచ్ యాదగిరి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

**సూర్యాపేట(జనంసాక్షి):**
గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం సూర్యాపేట పట్టణంలోని శ్రీసాయిబాబా మందిరంలో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, సూర్యాపేట నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు.గురువే జ్ఞానానికి మార్గదర్శి అని అన్నారు. గురుపౌర్ణమి మన జీవితంలో గురువు యొక్క మహోన్నత స్థానాన్ని స్మరించుకునే పవిత్రమైన రోజని పేర్కొన్నారు.గురువుల బోధనలు, మార్గదర్శకత్వం వ్యక్తిత్వ వికాసానికి మాత్రమే కాకుండా సమాజ అభ్యున్నతికి కూడా ఎంతో అవసరమని, గురువులను గౌరవిస్తూ వారు చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పెద్దిరెడ్డి రాజా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, చివ్వెంల మండల పార్టీ అధ్యక్షులు ధారవత్ వీరన్న నాయక్, కౌన్సిలర్లు కొనతం రాజేష్ రెడ్డి, కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, షేక్ జహీర్, గుణగంటి హేమ సతీష్, శ్రీదండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, మిర్యాల సుధాకర్, పోతుగంటి మల్లికార్జున్,పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బెలిదె శ్రీనివాస్, నాయకులు నాగేల్లి అరుణ్ కుమార్, నరేష్ పిళ్లే, రాచకొండ శ్రీనివాస్, జూలకంటి నాగరాజు, దేవస్థాన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయ పార్టీల నాయకుల, ప్రతినిధులతో ఆర్డీవో సమీక్షా సమావేశం

## డిజిటలైజేషన్, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై చర్చ

**చండూరు, జూలై 29 (జనంసాక్షి)**
మునుగోడు శాసనసభ నియోజకవర్గ పరిధిలోని ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ ఎస్ ఆర్), పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై చండూరు ఆర్డీవో కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.
?ఆర్డీవో శ్రీదేవి, ట్రైనింగ్ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో అధికారుల బృందం కీలక విషయాలను వెల్లడించింది ఈ-ఫారమ్స్ 100% డిజిటలైజేషన్: ఓటరు నమోదు, సవరణలకు సంబంధించిన 'ఈ-ఫారమ్స్ డిజిటలైజేషన్ పూర్తయిన తీరును అధికారులు వివరించారు.?డిఎస్ఈ, ప్రాసెసింగ్: నకిలీ ఓట్ల ఏరివేత, ఓటర్ల జాబితా నాణ్యత పెంపుపై సాధించిన పురోగతిని తెలిపారు.?పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ: ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేలా పోలింగ్ కేంద్రాల సర్దుబాటు ప్రక్రియను వివరించారు.?ఈ సమావేశంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులు, ప్రతినిధులు మరియు బిఎల్ఓ-1లు పాల్గొని తమ అభిప్రాయాలను, సూచనలను అధికారులకు తెలియజేశారు.

# రేషన్ డీలర్ల నిర్లక్ష్యంతో ఈ-కేవైసీకి ఆటంకం



**కొండమల్లేపల్లి జులై 29 (జనంసాక్షి):**
రేషన్ కార్డు ఈ-కేవైసీ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో పలుచోట్ల రేషన్ డీలర్ల దుకాణాలు మూసివేయడంతో కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ-కేవైసీ పూర్తి చేసుకునేందుకు వచ్చిన లబ్ధిదారులు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. డీలర్ల మొండి వైఖరిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, రేషన్ దుకాణాలు తెరిపించి ఈ-కేవైసీ ప్రక్రియను సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు.

# 20 లేగ దూడలపై వీధి కుక్కల దాడి

## ప్రజల్లో భయాందోళన - వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్



**తిరుమలగిరి (సాగర్), జూలై 29 (జనంసాక్షి) :**
తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలో బుధవారం వీధి కుక్కలు ఒక్కసారిగా రెచ్చిపోయి సుమారు 20 లేగ దూడలు ,గేదెల పై దాడి చేశాయి. ఈ ఘటన లో పలుచోట్ల దూడలకు గాయాలు కావడంతో యజమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. స్థానికులు కుక్కలను తరిమికొట్టి దూడలను రక్షించారు. మండల కేంద్రంలో వీధి కుక్కల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు ,పశువులపై తరచూ దాడులు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో భయాందోళన నెలకొంది.వెంటనే సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పిచ్చికుక్కలను పట్టుకొని ప్రజలకు, పశువులకు రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గాయపడిన లేగ దూడలు పశువులకు పశువైద్య శాఖ ద్వారా తక్షణ చికిత్స అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



**వలిగొండ, జూలై 29 (జనంసాక్షి)**
రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు గురువారం స్థానిక పిఏసిఎస్ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం, బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల ఆర్థిక సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందని, రైతులకు రుణ మాఫీ, రైతు బందు, సబ్సిడీలో యంత్ర పరికరాలు, సాగు నీటి కాల్వల అభివృద్ధి లాంటి కార్యక్రమాలు చేపట్టి రైతుల సంక్షేమాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని అన్నారు.నూతన ఛైర్మెన్ గా బాధ్యతలు చేపట్టిన గరిసే రవిని ఉద్దేశించి ప్రజలు, రైతులు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకొనిబాధ్యతాయుతంగా రైతుల సంక్షేమం కొరకు, సహకార సంగం అభివృద్ధికి పారదర్శకతతో,జవాబుదారి తనంతో సేవలు అందించాలని అన్నారు. మండల అభివృద్దే ప్రధాన లక్ష్యంగా విద్య, వ్యవసాయం, సంక్షేమం కొరకు పనిచేస్తానని అన్నారు. అనంతరం మండలంలోని వెంకటాపురం లోని శ్రీ మత్స్యగిరి లక్ష్మీనర్సింహా స్వామి ఆలయ కమిటీ నూతన కార్యవర్గం చైర్మన్ గ తుమ్మల శ్రీనివాస్, ధర్మకర్తల ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తూ,ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని నూతన కార్యావర్గానికి సూచిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆపరేటివ్ అధికారి నాగార్జున, దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ నిఖిల్, మార్కెట్ కమిటీ ఛైర్మెన్ భీమా నాయక్, సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి, మండల అధ్యక్షులు బత్తిని సహదేవ్ , పట్టణ అధ్యక్షులు జానకి రాములు,పాశం సతిరెడ్డి, వాకిటి అనంతరెడ్డి,చిట్టెడి జనార్ధన్ రెడ్డి, గూడూరు శివశంత్ రెడ్డి, పిఏసిఎస్ ఉపాధ్యక్షుడు జక్క జం గారెడ్డి, కొండూరు భాస్కర్, పలుసం సతీష్, కొండూరు సాయి,నూతన డైరెక్టర్ లు, సహకార సంగం సిఈఓ ముత్యాలు,ఆలయ పండితులు, సిబ్బంది భక్తులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం: కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్గొండ, జూలై 29,(జనంసాక్షి):** మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి కోటీశ్వరులుగా, విజయవంతమైన మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. బుధవారం జిల్లా మహిళా సమాఖ్యలో నిర్వహించిన నీలగిరి జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలోని కిసాన్ డ్రోన్ ఆపరేటర్లకు మిరాయి సంస్థ అందించిన 10 రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసిన 50 మంది స్వయం సహాయక సంఘాల మహిళలను అభినందించి వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డ్రోన్ ఆపరేషన్‌తో పాటు మరమ్మతులు, నిర్వహణ, భద్రతా ప్రమాణాలపై మహిళలకు సమగ్ర శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందడంతో పాటు ఇతర రైతులకు కూడా డ్రోన్ సేవలు అందించి మంచి ఆదాయం పొందే అవకాశం ఉందని చెప్పారు. జిల్లాలో సుమారు 6 లక్షల ఎకరాల్లో డ్రోన్ సేవలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, ఒక్క ఎకరానికి రూ.400 చొప్పున సేవలు అందించడం ద్వారా మహిళలు మంచి ఆదాయం సంపాదించవచ్చన్నారు. సమిష్టిగా పనిచేస్తే మూడు నెలల్లోనే గణనీయమైన ఆదాయం సాధించే అవకాశముందని పేర్కొన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో డ్రోన్ సేవలు అందించే మహిళల వివరాలు, సంప్రదింపు నంబర్లను ప్రదర్శించేలా ప్రచారం చేపడతామని తెలిపారు. మిరాయి సంస్థ మూడు సంవత్సరాల పాటు డ్రోన్ల మరమ్మతులు, స్పేర్ పార్ట్స్ విషయంలో సాంకేతిక సహాయం అందిస్తుందని చెప్పారు. స్త్రీనిధి ద్వారా రుణాలు తీసుకుని ధైర్యంగా మార్కెట్లోకి అడుగుపెట్టాలని, ఇప్పటికే ఉన్న సంస్థలకు పోటీగా ఎదగాలని మహిళలకు సూచించారు. ప్రారంభంలో లాభాలు వెంటనే రాకపోయినా నిరుత్సాహపడకుండా సేవలను విస్తరించాలని, ముఖ్యంగా మహిళా రైతులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, మిరాయి సీఈఓ విజయ్, హెట్రో సీఎస్ఆర్ చైర్మన్ సుధాకర్, పరిశ్రమల అధికారి సతీష్, నవరత్న శ్రీనివాస్, ఈశ్వర్, జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి సునీత, శిక్షకులు, అధికారులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్లే లక్ష్యం.. ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తాం..

**చింతపల్లి, జులై 29(జనంసాక్షి)** గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందేలా చర్యలు చేపడతామని చింతపల్లి సర్పంచ్ కాసారపు శ్వేత శ్రీనివాస్ తెలిపారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆమె అధ్యక్షత వహించగా, చింతపల్లి ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి పైప్‌లైన్ల మరమ్మతులు, బోర్ల అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. అలాగే పారిశుద్ధ్యం, సీసీ రోడ్ల నిర్మాణం తదితర సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని చెప్పారు. ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి మాట్లాడుతూ గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ కట్టుబడి ఉందన్నారు. సైబర్ నేరాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామసభలో గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు, తాగునీటి సౌకర్యం, రేషన్ కార్డులు, వృద్ధాప్య పెన్షన్లపై గ్రామస్తులు తమ సమస్యలు, సందేహాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, గ్రామ పంచయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్ ,గ్రామ వార్డ్ మెంబర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## భువనగిరి నేషనల్ హైవేపై వెంటనే ఫ్లైఓవర్ నిర్మించాలి

### తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా

**భువనగిరి, జూలై 29(జనంసాక్షి)** భువనగిరి పట్టణం నుంచి రామకృష్ణాపురం, రామచంద్రాపురం, పెంచికల్‌పాడు, చందుపట్ల, కుమ్మరిగూడెం, బండ సోమారం తదితర గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాలంటే భువనగిరి నేషనల్ హైవేపై తక్షణమే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నేషనల్ హైవేపై భారీ ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు షేక్ రియాజ్, పార్టీ నాయకుడు తాళ్లపల్లి శివకుమార్ నాయకత్వంలో స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి తీన్మార్ మల్లన్న మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, భువనగిరి నుంచి పలు గ్రామాలకు వెళ్లే ప్రజలు ప్రతిరోజూ నేషనల్ హైవేను దాటాల్సిన పరిస్థితి ఉందని, దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఇదే ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో భువనగిరికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రమాదాలు వరుసగా జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు, నేషనల్ హైవే అథారిటీ ఈ ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మాణంపై దృష్టి సారించక పోవడం దురదృష్టకరమన్నారు. భువనగిరి నేషనల్ హైవేపై వెంటనే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, నేషనల్ హైవే అథారిటీ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డిమాండ్ నెరవేరే వరకు ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎండీ సోయల్, సాజిద్, బాజా కృష్ణ, బాజా మణి తో పాటు రామకృష్ణాపురం, రామచంద్రాపురం, పెంచికల్‌పాడు, చందుపట్ల, సోమారం తదితర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వర్షపు నీరు నిల్వకుండా చర్యలు వేగవంతం

### క్షేత్రస్థాయిలో పర్యటించిన మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్.. అధికారులకు కీలక ఆదేశాలు

**భువనగిరి, జూలై 29 (జనంసాక్షి)** మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో భువనగిరి పట్టణంలో ఎక్కడా వర్షపు నీరు నిల్వ ఉండకుండా, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా జాంఖానగూడ చౌరస్తా సమీపంలోని మురికి కాలువల్లో పూడుకుపోయిన మట్టి, చెత్తను జేసీబీ సాయంతో తొలగించి కాలువలను శుభ్రం చేయించారు. వర్షపు నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగకుండా డ్రైనేజీలను పూర్తిగా శుభ్రపరచాలని, నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులు, సిబ్బందికి చైర్‌పర్సన్ ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పారిశుద్ధ్య నిర్వహణతో పాటు డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు సత్వర సేవలు అందించాలని ఆదేశించారు.

## హామీలు అమలు చేయకపోతే మళ్లీ గుడిసెలే

### వారం రోజుల్లో భూమి చదును చేసి ప్లాట్లు చూపించాలి.. లేకుంటే మళ్లీ గుడిసెలు వేస్తాం

### సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ



**భువనగిరి, జూలై 29(జనం సాక్షి)** భువనగిరి పట్టణ పరిధిలోని 700 సర్వే నంబర్ భూములకు పట్టాలు పంపిణీ చేసి ఏడాది గడిచినా ఇప్పటికీ భూమిని చదును చేసి లబ్ధిదారులకు ప్లాట్లు చూపించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ విమర్శించారు. బుధవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య భవన్‌లో గంధమల్ల మాతయ్య అధ్యక్షతన నిర్వహించిన భూ పోరాట కమిటీ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వారం రోజుల్లో భూమిని చదును చేసి ప్లాట్లు చూపించే ప్రక్రియను ప్రారంభించకపోతే భూ పోరాట కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారులు తిరిగి గుడిసెలు నిర్మించి ఆందోళన చేపడతారని హెచ్చరించారు. భువనగిరి పట్టణంలో అనేక మంది నిరుపేదలు సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో జీవనం సాగిస్తున్నారని, కుటుంబ సభ్యులు మరణించినా ఇంటి ముందు అంత్యక్రియలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించే పరిస్థితి కూడా లేక నేరుగా శ్మశానవాటికకు తీసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ప్లాట్లు అందించే వరకు దశలవారీగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, కార్యవర్గ సభ్యులు బందెల ఎల్లయ్య, వనం రాజు, కమిటీ సభ్యులు వలదాస్ అంజయ్య, చింతల శివ, కొత్త లక్ష్మయ్య, లలిత, భూ పోరాట కమిటీ కన్వీనర్ దొడ్డి శంకర్, కో-కన్వీనర్ నారకలమ్మ, పిట్టల చంద్రశేఖర్, కన్యబోయిన అరుణ, స్రవంతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణే మనందరి బాధ్యత సర్పంచ్ రాయించు జానయ్య



**మాడుగులపల్లి జూలై 29 (జనం సాక్షి):** గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందించడం, పర్యావరణాన్ని పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అభంగపురం గ్రామ సర్పంచ్ రాయించు జానయ్య పిలుపునిచ్చారు మాడుగులపల్లి మండలంలోని అభంగపురం గ్రామంలో బుధవారం గ్రామస్తులకు వివిధ రకాల మొక్కల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా సర్పంచ్ రాయించు జానయ్య మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న పచ్చదనం కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు ప్రతీ ఇంటివద్దా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని గ్రామస్తులకు సూచించారు ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సంధ్యారాణి, వార్డు సభ్యులు సుఖేందర్ రెడ్డి, శ్రవణ్, సుశీల, గోవిందమ్మతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలకు సౌండ్ బాక్స్ అందజేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్



వలిగొండ, జూలై 29 (జనంసాక్షి) గురు పౌర్ణమి సందర్భంగా మండలకేంద్రంలో ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్ సౌండ్ బాక్స్‌ను అందజేశారు. విద్యార్థులకు జరిగే ప్రార్థనకార్యక్రమాలు, జాతీయ పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అవగాహన సభలు మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ సౌండ్ బాక్స్ ఉపయోగపడుతుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఏలే చంద్రశేఖర్ మాట్లాడుతూ... విద్యాభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ముందుంటామని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, విద్యార్థుల అవసరాలను గుర్తించి సౌండ్ బాక్స్ అందించడం అభినందనీయమని అన్నారు.

# ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సహకరించాలి

## రాజకీయ పార్టీల ప్రతినిధుల సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ హరిసింగ్



సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, తప్పుల్లేకుండా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.హరిసింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియ వేగంగా సాగుతుందని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జూలై 24తో ముగియాల్సిన బీఎల్ఓల ఇంటింటి సర్వే గడువును, క్షేత్రస్థాయిలో మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రకటించారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని, సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్ చేసే డిజిటలైజేషన్ ప్రక్రియ ప్రస్తుతం 98.77 శాతానికి చేరుకుందని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉండటం, చనిపోయిన వారి పేర్లు అలాగే ఉండటం వంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలోబీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను ధ్రువీకరించు కోవాలన్నారు. 2026 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే యువతీ యువకులందరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఈ సమీక్షలో కొత్త పోలింగ్ స్టేషన్ల పై చర్చ జరిగింది. 1200 ఓటర్లు దాటితే కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటుపై చర్చించారు. జిల్లాలోని ఓటర్లు తమ ఓటు హక్కును సరిచూసుకోవాలని, బీఎల్ఓలు ప్రతి రాజకీయ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకుని, ఓటర్ల జాబితా ప్రక్షాళనలో అధికారులకు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ప్రేమ్ రాజ్, వివిధ పార్టీల ప్రతినిధులు సిహెచ్. రాజేశ్వర రావు, చల్లమల్ల నరసింహ, ఎండి.అబీద్, ఎం.స్టాలిన్, ఎస్.సత్యనారాయణ, కరుణాకర్ రెడ్డి, కోట గోపి, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన పందుల పద్మకు వైద్య సహాయం..

## కష్టకాలంలో అండగా నిలిచిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

### రూ. 2.50 లక్షల ఎల్.ఓ.సి నిధులను అందజేసిన కాంగ్రెస్ నాయకులు



చండూరు, జూలై 29 (జనంసాక్షి) వారం రోజుల క్రితం హఠాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పందుల యాదయ్య భార్య పద్మకు కాంగ్రెస్ నాయకులు, స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అండగా నిలిచారు.? బాధితురాలి పరిస్థితిని తెలుసుకున్న గుండ్రేపల్లి కాంగ్రెస్ నాయకులు వెంటనే ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆస్పత్రి వర్గాలతో మాట్లాడి,బాధితురాలి ఆర్థిక పరిస్థితిని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే తక్షణమే స్పందించి, పద్మకు మెరుగైన వైద్యం అందించేందుకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో బెడ్ కేటాయించేలా చర్యలు తీసుకున్నారు.?ఈ క్రమంలోనే మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన రూ. 2,50,000 (రెండు లక్షల యాభై వేల రూపాయల) ఎల్.ఓ.సి చెక్కును కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కాసాల జనార్దన్ రెడ్డి, యువజన నాయకులు కాసాల నాగిరెడ్డి, ఉయ్యాల నరేందర్ రెడ్డి బుధవారం ఆస్పత్రికి వెళ్లి బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.?ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఆపదలో ఉన్న పేద వర్గాలకు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. తమ కుటుంబానికి అండగా నిలిచి తక్షణ ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యేకు, కాంగ్రెస్ నాయకులకు పద్మ కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సాయి బాబా ఆలయంలో వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు

## - మాగంటి సూర్యం జ్ఞాపకార్థం అన్నప్రసాద వితరణ



భద్రాచలం జూలై 29 (జనంసాక్షి) భద్రాచలంలోని షిర్డి సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామునే బాబా వారికి మేలుకొలుపు సేవ అనంతరం ఆలయ అర్చకులు భక్తుల సమక్షంలో పంచామృతాలతో అభిషేకించారు. భారీగా తరలివచ్చిన భక్తులు బాబా వారికి స్వయంగా పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో బాబా వారిని అలంకరించిన ఆలయ అర్చకులు స్వామివారికి నైవేద్య సమర్పణ అనంతరం హారతి సమర్పించారు. బాబా దర్శనానికి వచ్చిన భక్తులకు సహస్రనామ గోత్రనామ పూజలు నిర్వహించి బాబా వారి తీర్థప్రసాదాలను అందించారు. అలాగే భక్తులకు షిరిడి సాయిబాబా ఆలయ మాజీ అధ్యక్షులు మాగంటి సూర్యం జ్ఞాపకార్థం వారి కుమారులు మాగంటి శ్రీనివాస వరప్రసాద్ మాగంటి రమేష్ బాబు లు భక్తులకు అన్నదానం చేశారు. సుమారు 3000 మంది పైచిలుకు భక్తులు హాజరు కాగా 12 గంటల నుండి మూడు గంటల వరకు అన్న ప్రసాదాన్ని భక్తులకు అందించారు. ఈ సందర్భంగా మాగంటి సూర్యం కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నూతన సంవత్సర మొదటి గురువారం బాబా భక్తులకు అన్నదానం చేయడంతో పాటు గురుపౌర్ణమి నాడు భక్తులకు అన్నప్రసాద వితరణ సుదీర్ఘకాలంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు. అలాగే ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు బాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సమయంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కొమ్మనపల్లి ఆదినారాయణ కమిటీ సభ్యులు స్వాగతం పలుకగా, ఆలయ అర్చకులు సహస్రనామ గోత్రనామ పూజలు నిర్వహించి స్వామి వారి శేష వస్త్రాలు బహుకరించి తీర్థ ప్రసాదాలను అందించారు.

# మూసి కలుషిత జలాలతో ప్రజల ప్రాణాలకు ముప్పు

◆500 ఎకరాల సన్నకారు రైతుల ఆవేదనను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

◆బీఎస్పీ భువనగిరి పార్లమెంట్ ఇంచార్జి కత్తుల కాన్షీరామ్



రామన్నపేట, జూలై 29 (జనంసాక్షి): మూసి కలుషిత జలాలతో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని బిఎస్పి భువనగిరి పార్లమెంట్ ఇన్చార్జి కత్తుల కాన్షీరామ్ అన్నారు. బుధవారం మండలంలోని మునిపంపుల గ్రామకంఠం గుండా వెళ్లే ఆసిఫ్‌నగర్ కాలువ (మూసి కాలువ) ను బహుజన సమాజ్ పార్టీ నాయకులు సందర్శించారు.

ఈ సందర్భంగా కాన్షీరామ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం నుండి విడుదలయ్యే కలుషిత మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు మూసి ద్వారా నాగారం, తుమ్మలగూడెం, శోభనాద్రిపురం, నీర్నెముల, దుబ్బాక గ్రామాల మీదుగా ఈ ప్రాంతానికి చేరి ఆసిఫ్‌నగర్ కాలువలో ప్రవహిస్తున్నందున ఈ కలుషిత నీటితోనే రైతులు వరి, కూరగాయ పంటలు, ఇతర పంటలు చేయాల్సి వస్తుంది. దీనివల్ల నేలసారం దెబ్బ తినడమే కాకుండా, పండే పంటలు కూడా కలుషితమై రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. అంతేకాకుండా పశువులు, గొర్లు, మేకలు, ప్రజల ఆరోగ్యానికీ తీవ్రమైన ముప్పుగా మారిందన్నారు. ఈ నీటిని తాకడానికే ప్రజలు భయపడుతున్న పరిస్థితి ఏర్పడిందని, బట్టలు ఉతకడానికి కూడా ఉపయోగించలేని స్థాయిలో కాలుష్యం ఉందని తెలిపారు.

మునిపంపుల గ్రామ పరిధిలో ఈ కాలువకు అవతల ఉన్న సుమారు 500 ఎకరాల సన్నకారు రైతుల భూములకు చేరుకోవాలంటే రైతులు ప్రతిరోజూ ప్రాణాలను పణంగా పెట్టాల్సి వస్తోందన్నారు. ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన రైతులు ఎకరం, రెండు ఎకరాలు, అర ఎకరం వంటి చిన్న భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, వారి జీవనాధారం ఈ సమస్యతో ప్రమాదంలో పడిందన్నారు. వర్షాలు వచ్చినప్పుడు ఈ కాలువలో నీటి ప్రవాహం మరింత ఉధృతంగా మారి రైతులు, వ్యవసాయ కూలీలు కాలువ దాటలేని పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. కలుషిత జలాల కారణంగా పాములు, విషజంతువులు అధికంగా సంచరిస్తుండటంతో రైతులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ఈ కాలువపై వంతెన నిర్మిస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి రైతులను మోసం చేశారని ఆయన తీవ్రంగా విమర్శించారు. అధికారాలు మారినా రైతుల కష్టాలు మాత్రం మారలేదని, హామీలు మాత్రమే మిగిలాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల సమస్యను పరిష్కరించకపోతే బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి మండల, జిల్లా స్థాయిలో ఆందోళనలు నిర్వహించడంతో పాటు ఇరిగేషన్ శాఖ కార్యాలయాలు, జిల్లా కలెక్టర్ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయాల ఎదుట శాంతియుత ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే ఈ సమస్యను రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షులు గ్యార శేఖర్, నకిరేకల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు పావురాల నరసింహ యాదవ్, మండల నాయకులు బెల్లి మల్లయ్య గౌడ్ పాటు స్థానిక రైతులు, రాములమ్మ ,లింగయ్య వెంకన్న సైదులు పాపయ్య గార్లు మరియు రేణుక నిర్మలా ఎల్లమ్మ మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి పోటీ పరీక్షలపై దృష్టి సారించాలి



**కోదాడ( జనంసాక్షి):** కోదాడ కె. ఆర్. ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాల గురు పూర్ణిమ సందర్భంగా విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ సెమినార్ నిర్వహించారు. అనంతరం ముఖ్యఅతిథిగా ఇంటర్మీడియట్ విద్య మాజీ కమిషనర్ డి. చక్రపాణి పాల్గొని మాట్లాడుతూ... విద్యార్థులు ప్రతిరోజూ వార్తాపత్రికల ద్వారా, వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా, కాంపిటేటివ్ బుక్స్ ని అధ్యయనం చేయడం ద్వారా జ్ఞానంతో పాటు, జీవితంలో స్థిరపడవచ్చునని ఆయన అన్నారు. అలాగే మార్కెట్లో ఏ ఉద్యోగానికి ఎక్కువ డిమాండ్ ఉందో కూడా తెలుసుకోవచ్చు అన్నారు. అందుకోసం ఎలాంటి విద్య చదవాలి, నైపుణ్యాలను ఎలా పెంచుకోవాలి అనే విషయాలు తెలుస్తాయన్నారు. మద్రాస్ ఐఐటి కళాశాల ప్రొఫెసర్ శ్రీనివాస చక్రవర్తి పాల్గొని మాట్లాడుతూ నేర్చుకోవాలి అనే సంకల్పం బలంగా ఉంటే గ్రామీణ నేపథ్యం, పేదరికం ఆటంకం కాదని, సోదాహరణంగా, సాధికారికంగా, సరళ శైలిలో వివిధ శాస్త్రవేత్తల అనుభవాలను, సినిమాలలోని విషయాలను, మంచి పుస్తకాలను ఉటంకిస్తూ అర్థవంతంగా వివరించారు విద్యార్థులు నూతన ఆవిష్కరణలకొరకు నిరంతరం ప్రయత్నిస్తూ విజయాన్ని సాధించాలని అన్నారు. కొత్త నైపుణ్యాల కోసం నిరంతరం శ్రమిస్తూ ఉండాలని
అలా చేస్తే విజయం మీ సొంతమవుతుందన్నారు. ఎప్పుడూ నేర్చుకోవాలి అనే తపన,కోరికతో కలలు కనాలి, వాటిని నిజం చేసుకోవాలి అన్నారు. విశ్రాంత ప్రధాన ఆచార్యులు పోతుగంటి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్న స్థితి నుంచి అత్యున్నత స్థాయికి ఎదగడానికి మార్పును అస్త్రంగా మలచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణారెడ్డి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రామన్నపేట నూతన సిఐ, ఎస్సైలకు ఘన సన్మానం



**రామన్నపేట, జూలై 29 (జనంసాక్షి ):** రామన్నపేట పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బదిలీపై వచ్చిన సిఐ ఎం. రవి, ఎస్సై సతీష్ గోపతి లను మాజీ మదర్ డైరీ చైర్మన్ గంగుల కృష్ణారెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టపరంగా పనిచేస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రామన్నపేట పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజాప్రతినిధులు, నాయకులు ఎల్లప్పుడూ పోలీస్ శాఖకు సహకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి జమీరుద్దీన్, సీనియర్ అడ్వకేట్ ముత్యాల సత్తిరెడ్డి,నాయకులు అనంత కుమార్, కంచి నరసింహ,ముక్కామల పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా శ్రీ చెన్నకేశవ స్వామి కళ్యాణం

**రామన్నపేట, జూలై 29 (జనంసాక్షి):** రామన్నపేట పట్టణ కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని బుధవారం కన్నుల పండుగగా నిర్వహించారు. గురు పౌర్ణమి పురస్కరించుకొని ఉదయం శ్రీ భూ లీల సమేత చెన్నకేశవ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ పూజారి ఎం శ్రీనివాసచార్యులు పండితుల మంత్రోచ్చారణలు, మేళతాళాల మధ్య స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. సందర్భంగా పూజారి శ్రీనివాసచార్యులు శ్రీదేవి మాట్లాడుతూ మన ఆలయంలో కొలువై ఉన్న శ్రీ గోలీల సమేత శ్రీ చెన్నకేశవ స్వామిశ్రీ భూ లీల సమేత శ్రీ చెన్నకేశవ స్వామి కళ్యాణం ప్రతి నెల పౌర్ణమి రోజున నిర్వహించుకుంటున్నామని, ఈ కళ్యాణాన్ని మాస కళ్యాణమని మొక్కుబడి కళ్యాణమని పిలుచుకుంటామని, భక్తుల సాహసకారాలతోని ఎంతో వైభవంగా కన్నుల పండుగ ప్రతి కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లవణం ఉపేంద్ర జానకి, వైస్ చైర్మన్ కొంపెల్లి సుమలత సురేష్ జెల్ల వెంకటేష్, కొత్త మాసు మధుసూదన్ శోభ, మిరియాల వెంకటయ్య కవిత, మిరియాల రమేష్ జయమ్మ, సోమ నరసింహ చారి విజయ, కామిశెట్టి రాధా కిషన్ రాణి, లవణం నరేంద్ర పావని, గోగి కార్ సైదులు మౌనిక, సంగం భాగ్యలక్ష్మి, ఆమంచి ధనలక్ష్మి,సంగం లావణ్య, పిట్టల ధనలక్ష్మి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



**హాలియా జూలై 29 జనంసాక్షి**
హాలియా మున్సిపాలిటీ పరిధిలోని సాయి మందిరంలో బుధవారం గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు ఆలయ అర్చకుడు మనోజ్ పాండే వెంకటాచార్యులు. రమణ శర్మ భీష్మాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు ఉదయం కాగడ హారతి కంకణా ధారణ పుష్పార్చన మరియు సంస్థాన హారతి. దునిపూజ కాకడ హారతి అనంతరం భక్తులకు బాబా దర్శనం హలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్ర రెడ్డి దీప్తి హాలియా సీఐ రాఘవరావు ఎస్సై సాయి ప్రశాంత్ ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు మధ్యాహ్నం మా అన్న దాన ప్రసాద్ వితరణ. కుంకు శంకర ఆధ్వర్యంలో భజన కార్యక్రమం భజన కార్యక్రమం. సామూహిక విష్ణు నామ సూత్ర పారాయణం. సాయంత్రం హాలియా పురవీధుల్లో మహిళా కోలాటాలతో శోభయాత్ర. బ్రాహ్మణ ఆశీర్వచనం పవలింపు సేవ ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తే లపోలు శేఖర్. సక్రు నాయక్ శివకుమార్ ఆలయ ధర్మకర్త మిట్టపల్లి సుబ్బారావు ఆర్యవైశ్య సంఘ పెద్దలు మిట్టపల్లి వాసులు రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు చిట్టి పో లు యాదగిరి కౌన్సిలర్లు రాజా రమేష్ యాదవ్ కుందూరు వెంకటరెడ్డి చిట్టిపోలు శ్రీదేవి కరుణాసాగర్. బొంగరాలయేసు రాజు ఎడవెల్లి రంజితు చెరుపల్లి ముత్యాలుచీదళ్ళ లింగయ్య. వీరమళ్ళ కృష్ణయ్య. ఊర వేణు కొండూరు వెంకటేశ్వర్లు. మంచుకొండ ప్రభాకర్. బచ్చు వెంకన్న మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## బిల్లును వ్యతిరేకించిన ఇండియా కూటమి తీరు సిగ్గుచేటు

### బీజేపీ మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి



**రామన్నపేట, జూలై 29 (జనంసాక్షి):** పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కఠినమైన యాంటీ పేపర్ లీక్ బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్ మరియు ఇండియా కూటమి తీరు సిగ్గుచేటని బీజేపీ మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్‌పై రోడ్లపై నిరసనలు చేసిన ఇండియా కూటమి ఎంపీలు, పేపర్ లీక్ మాఫియాను 10 ఏళ్ల పాటు జైల్లో పెట్టే చట్టానికి పార్లమెంట్‌లో 'వద్దు' అని చెప్పడం విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడడమే అన్నారు. క్వశ్చన్ పేపర్ లీక్‌ను చివరకు ఒక క్రిమినల్ నేరంగా గుర్తించిన చారిత్రాత్మక బిల్లు ఇదని అన్నారు. పేపర్ లీక్‌లపై చర్చ కావాలని డిమాండ్ చేసి, ప్రభుత్వం కఠిన చట్టం తెస్తే దానినే అడ్డుకుంటున్నారని, ఇది సెలెక్టివ్ రాజకీయమని విమర్శించారు. పంజాబ్, కర్ణాటక, తెలంగాణలో జరిగిన పేపర్ లీక్‌లపై వీరు మాట్లాడరని, కేవలం బీజేపీపై బురద చల్లడమే వీరి పనని ఆరోపించారు. పేపర్ లీక్‌లతో సంవత్సరాల సమయం కోల్పోయిన ప్రతి విద్యార్థి వీరి నాటకాలను గమనిస్తున్నారని, దేశ ప్రజలందరూ ఈ బిల్లును స్వాగతించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి జాతి వ్యతిరేక చర్యలను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని స్పష్టం చేశారు.

## వెంచర్లలో అల్యూమినియం వైర్ల చోరీ ముఠా గుట్టురట్టు

### ఏడుగురు అరెస్ట్..రూ.2 లక్షల విలువైన వైర్లు, రూ.1.80 లక్షల నగదు స్వాధీనం..





**చింతపల్లి, జులై 29(జనంసాక్షి)** చింతపల్లి మండలంలో నిర్మాణంలో ఉన్న వెంచర్లను లక్ష్యంగా చేసుకుని విద్యుత్ స్తంభాలపై ఉన్న అల్యూమినియం వైర్లను చోరీ చేస్తున్న ముఠాను చింతపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో ఏడుగురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.2 లక్షల విలువైన 13 క్వింటాళ్ల అల్యూమినియం వైర్లు, రూ.1.80 లక్షల నగదు, ఒక కారు, రెండు ట్రాలీ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు దేవరకొండ డీఎస్పీ ఎం.వి. శ్రీనివాసరావు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి, మర్రిగూడ మండలాల్లో నిర్మాణంలో ఉన్న వెంచర్లలో నిందితులు పగటిపూట రెక్కీ నిర్వహించి, రాత్రివేళ ఎవరూ లేని సమయంలో విద్యుత్ స్తంభాలపై ఉన్న అల్యూమినియం వైర్లను కత్తిరించి కార్లు, ట్రాలీల్లో తరలించి విక్రయించేవారు. ఈ నెల 25న చింతపల్లి మండలం రాయినిగూడెం శివారులోని సాగర్ మేడ్ హౌస్ వెంచర్‌లో జరిగిన చోరీపై నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా బుధవారం వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు అనుమానాస్పదంగా వెళ్తున్న వాహనాలను ఆపి తనిఖీ చేయగా చోరీ చేసిన వైర్లు లభ్యమయ్యాయి. దీంతో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా పలు చోరీలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు తెలిపారు. నిందితులపై చింతపల్లి, మర్రిగూడ పోలీస్‌స్టేషన్లలో ఇప్పటికే పలు కేసులు నమోదైనట్లు పోలీసులు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు దేవరకొండ డీఎస్పీ పర్యవేక్షణలో నాంపల్లి సీఐ రాజు, చింతపల్లి ఎస్ఐ రామ్మూర్తి, మర్రిగూడ ఎస్ఐ రాంబాబు, పోలీసు సిబ్బంది కేసును ఛేదించగా, వారిని ఎస్పీ అభినందించారు.

# చింతకాని పాఠశాలలో ఘనంగా అల్పాహార కార్యక్రమం ప్రారంభం

### విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత: సర్పంచ్ కిలారు మనోహర్ బాబు

**చింతకాని, జూలై 29 (జనం సాక్షి)**
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అల్పాహార పథకాన్ని చింతకాని మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ కిలారు మనోహర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అల్పాహారం అందించి, వారితో కలిసి భోజనం చేస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే విద్యలో మంచి ఫలితాలు సాధించగలరని, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన అల్పాహార పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సర్పంచ్ అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. అల్పాహార పథకాన్ని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కలకు విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉప సర్పంచ్ కోలా ఉమారాణి, వార్డు సభ్యులు కిలారు బాబురావు, పొనుగోటి బాబు, వేముల ఆకాష్, రహీమ్ తుల్లా, గంధసిరి లలిత, టీడీపీ నాయకులు మల్లెల సత్యనారాయణ, కూచిపూడి సతీష్, షేక్ జానీ మియా, సీపీఎం నాయకులు దేశబోయిన ఉపేందర్, కోలా నాగేశ్వరావు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.






# వినాయకపురంలో గురుపౌర్ణమి సందర్భంగా మెగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం

### 40 సార్లు రక్తదానం చేసిన రుద్ర సతీష్ కు సన్మానం..

అశ్వరావుపేట,జూలై 29(జనం సాక్షి):
అశ్వరావుపేట మండలం వినాయకపురం గ్రామంలో గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని వినాయకపురం గ్రామంలోని ఉమా చంద్ర ఫంక్షన్ హాల్ వద్ద మెగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని బిర్రం వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో నిర్వహించగా ఈ సేవా కార్యక్రమంలో 60 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచారు. ఈ రక్తదాన శిబిరానికి అశ్వారావుపేట ఏరియా హాస్పిటల్, భద్రాచలం ఏరియా హాస్పిటల్ కు చెందిన వైద్యులు, సిబ్బంది ప్రత్యేకంగా హాజరై శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. రక్తదానం చేయడానికి వచ్చిన ప్రతి ఒక్కరి ఆరోగ్య స్థితిని ముందుగా పరీక్షించి, రక్తపోటు, హిమోగ్లోబిన్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో డా. మౌనిక(ఎంఎస్?ఓబీజీ, ఆర్ఎంఓ), డా. గోపాలకృష్ణ(ఎంబీబీఎస్, సివిల్ అసిస్టెంట్), గణేష్(ఎఫ్‌సిఏ), సిస్టర్ మేరీ సృజన, శిరీష (పీసీ), మహేష్(అంబులెన్స్ డ్రైవర్), ఎడిల్లన్ దాలు(ల్యాబ్), ఎల్. టి. శ్రీనివాసరావు తదితర వైద్య సిబ్బంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల ప్రసాద్, ఉప్పల మురళి, సుదర్శన్, గ్రామ సర్పంచ్ కొవ్వ రాజు, లోకం సాంబశివరావు, రుద్ర సతీష్, మారుతి లక్ష్మణరావు, ఉప్పల నాగమహేశ్వరరావు, బిర్రం రాజేష్, బిర్రం ఉదయ్ కుమార్, గ్రామ పెద్దలు, యువత, మహిళలు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



### వైద్యాధికారుల జూమ్ సమీక్ష సమావేశంలో

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారం రాథోడ్

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 30 (జనం సాక్షి):
జిల్లాలో సీజనల్ వ్యాధుల నివారణ, ఆరోగ్య కార్యక్రమాల సమర్థ అమలుపై అన్ని స్థాయిల వైద్యాధికారులు అప్రమత్తంగా పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ ఆదేశించారు. గురువారం వైద్యాధికారులతో నిర్వహించిన జూమ్ సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, ప్రైవేట్ క్లినిక్‌లలో యాంటీ రేబీస్ వ్యాక్సిన్ (కుక్కకాటు నివారణ టీకా) తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రతి ఆసుపత్రిలో కుక్కకాటు కేసుల పర్యవేక్షణకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి, సంబంధిత వివరాలను నోటీసు బోర్డుపై ప్రదర్శించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ హాస్టళ్లను ప్రతి రెండు వారాలకు ఒకసారి తనిఖీ చేసి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, హాస్టల్ సిబ్బందికి పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించాలని చెప్పారు. వంట చేసే సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆశా కార్యకర్తలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో పర్యటిస్తూ జ్వరం, విరేచనాలు, వాంతులు, దగ్గు, జలుబు వంటి లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించి వెంటనే వైద్యాధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి చికిత్స అందించాలని తెలిపారు. ప్రతి మంగళవారం, శుక్రవారం కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ఆరోగ్య కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసి వారాంత నివేదికలు సమర్పించాలని సూచించారు. వ్యాధులు అధికంగా నమోదవుతున్న గ్రామాలను గుర్తించి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. అలాగే వ్యాధి నిరోధక టీకాలు, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్, ఆరోగ్య మహిళ, సికిల్ సెల్ స్క్రీనింగ్, క్షయవ్యాధి అనుమానితుల గుర్తింపు, మందుల పంపిణీ తదితర కార్యక్రమాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ప్రోగ్రామ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ఆరోగ్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, విధుల పట్ల నిర్లక్ష్యం లేదా అలసత్వం ప్రదర్శించే సిబ్బందిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని డాక్టర్ తుకారం రాథోడ్ హెచ్చరించారు.

# ఐటీసీ సిఎస్ఆర్ నిధులతో నూతన అంగన్‌వాడీ భవనం ప్రారంభం

### - ఐటీసీ సేవలు అభినందనీయం - సర్పంచ్

**బూర్గంపహాడ్ జూలై 29 (జనంసాక్షి)**
బూర్గం పహాడ్ మండలంసారపాక గ్రామపంచాయతీ పరిధిలోని గాంధీనగర్ ఒడియా క్యాంప్‌లో ఐటీసీ 'మిషన్ సునేహ్రా కల్' మరియు వాష్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త సహకారంతో సుమారు రూ. 11.50 లక్షల హెచ్‌డీఎఫ్‌సీ?ఐటీసీ సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనాన్ని సోమవారం సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ అధికారిణి స్వర్ణలత లెనిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్ మాట్లాడుతూ, ఐటీసీ సంస్థ సిఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం, నాణ్యమైన విద్య, మౌలిక వసతుల కల్పనలో విశేష సేవలు అందిస్తోందని ప్రశంసించారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న సంస్థలను గౌరవించి, వారి సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలకు సూచించారు. తన పదవీకాలంలోనే సుమారు రూ. 8.50 కోట్ల అభివృద్ధి నిధులతో 130 సీసీ రోడ్లు, 150 కిలోమీటర్ల డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టి సారపాకను మట్టి రోడ్డు లేని గ్రామంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. బసప్ప క్యాంప్‌లో రూ. 25 లక్షల వ్యయంతో భవన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గత పాలనతో పోలిస్తే ప్రస్తుతం గ్రామంలో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందని, సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలకు తాము చేపడుతున్న అభివృద్ధి పనులే సమాధానమని అన్నారు. కార్యక్రమంలో సీడీపీవో మంగతాయారు, వార్డు సభ్యురాలు ఉమ, ఐటీసీ చీఫ్ మేనేజర్ చెంగలరావు, ఎంఎస్కే ప్రోగ్రామ్ మేనేజర్ జయప్రకాశ్, ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్‌లు గీత, తార ప్రసాద్, వాష్ ఇన్‌స్టిట్యూట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.ఆర్. బాలకృష్ణ, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి: కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 30 (జనం సాక్షి) :**
జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రహదారులపై పశువులను వదిలే యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన 42 బ్లాక్ స్పాట్లలో భద్రతా పనులను వచ్చే నెలాఖరులోగా పూర్తి చేయాలని, గుంతల పూడిక, హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్ల ఏర్పాటు వేగవంతం చేయాలని ఆదేశించారు. అతివేగం, హెల్మెట్, సీటుబెల్ట్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రమాద బాధితులకు 'గోల్డెన్ అవర్'లో వైద్యం అందేలా సమీప ఆసుపత్రులను మ్యాపింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 289 రోడ్డు ప్రమాదాలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 30 (జనం సాక్షి):**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేసి, నమోదు చేసిన ప్రతి వివరాన్ని ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు తప్పనిసరిగా పునఃధృవీకరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు ముందు ఎలాంటి పొరపాట్లు లేకుండా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్‌కు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇప్పటికే 95 శాతం డిజిటలైజేషన్ పూర్తైందని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు.




